ఆదివారం
ప్రజాశక్తి
మార్చి 27, 2005



వన్స్‌మోర్...
నాటకం వర్ధిల్లుతుంది



హ్యాపీ బర్త్‌డే

27.3.2005 నుంచి

2.4.2005 వరకు

చైతన్యసాయి-చందన సాయి
4సం॥, 27.3.2001
విజయలక్ష్మి-శ్రీనివాసవర్మ
గొల్లపాలెంగట్టు-విజయవాడ

లక్ష్మీరింధింకా
4సం॥, 27.3.2001
రమ-శ్రీనివాస్
అగనంపూడి-విశాఖ

నీరజ
2సం॥, 27.3.2003
ప్రమీల-శ్రీనివాసులు
పాణ్యం-కర్నూలు

అశ్రిత చౌదరి
1సం॥, 27.3.2004
ఆషా-శ్రీధర్‌బాబు
తెనాలి-గుంటూరు

ప్రభుదీపిక
4సం॥, 27.3.2001
సుజాత-రత్నం
నంద్యాలనాగిరెడ్డి కాలని-కడప

ఆర్తి
2సం॥, 31.3.2003
మంజుల-మహేష్
ఇలేగాం-ఆదిలాబాద్

ఫణీంద్ర
1సం॥, 1.4.2004
భారతి-శ్రీనివాసరావు
తాడేపల్లి-గుంటూరు

సాయి తేజదీప్
2సం॥, 31.3.2003
లక్ష్మి-రమేష్
జగన్నాథపురం-నల్లగొండ

విష్ణు
2సం॥,మార్చి-2003
అనూష-ఉమాశంకర్
గోదావరిఖని

సుప్రియ
7సం॥, మార్చి-1998
కృష్ణవేణి-వెంకటేష్
తిరుమలగిరి-సికింద్రాబాద్

గీతాంజలి
4సం॥, మార్చి-2001
వెంకమ్మ-లక్షణస్వామి
ముజఫర్‌నగర్-కర్నూలు

షాహిద్‌ఖాన్
షబాన-అరీఫ్‌ఖాన్
ఒ.డి.చెరువు-అనంతపురం

హర్షవర్ధన్
2సం॥, మార్చి-2003
సుశీల-రాజు
అమలాపురం-తూ॥గో॥

రాకేష్
5సం॥, మార్చి-2000
అరుణ-వెంకటేశ్వర్లు
యేదపి-ప్రకాశం

గమనిక: పదేళ్ల వరకు వయస్సు గల చిన్నారులందరికీ ఈ'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన తేదీకి 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, 1-1-298/4,
స్ట్రీట్ నెం. 1, అశోక్ నగర్, హైదరాబాద్-20





హ్యూగో ఛావెజ్

13వ తేదీ సంచిక కవర్‌స్టోరీ 'సాగిపో ఛావెజ్ మేమూ నీతోనే' బాగుంది. ఆద్యంతమూ ఆసక్తిగా చదివాం. హీరోగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన రియల్ హీరో ఛావెజ్. గ్రామ-పట్టణ ప్రజల హీరో ఈ హ్యూగో. అమెరికాతో సహా వివిధ దేశాలకు చెందిన రచయితలు, జర్నలిస్టులు, ఇతర మేధావులు 76మంది ఛావెజ్ మద్దతు ప్రకటిస్తూ... 'మేం గనుక వెనుజులా పౌరులం అయిఉంటే ఛావెజ్‌కు ఓటు వేస్తాం' అని ప్రకటించారు. అంటే నిజమైన ప్రజల హీరో ఇతను. ఇంత గొప్ప నాయకుని గురించిన సమాచారం ఇచ్చినందుకు అభినందనలు.

-బుర్రి కుమార్‌రాజా,

రత్నపురి కాలనీ, గుంటూరు

సాగిపో ఛావెజ్

కవర్‌స్టోరీ ద్వారా ఛావెజ్ గురించి తెలుగువారికి తెలియజేయడం ఎంతో బాగుంది. ఈ సందర్భంగా 'వెనిజులా వెనిజులా' కవిత భలే ఉత్సాహపరిచింది. భూమిని పేదోళ్ళ బువ్వగా చేసిన ఛావెజ్‌ను ఆదర్శంగా తీసుకుని భూసంస్కరణలు అమలుచేయాల్సిన అవసరం మన దేశంపై ఉంది. ప్రజాస్వామ్య పద్ధతితో ఎదుర్కొనలేక అమెరికా కిరాయి గూండాలతో ఛావెజ్‌ను హత్యచేయచూడటం హేయమైంది. దానికి ఎదురుతిరిగి నిలబడ్డ ఛావెజ్ నిజమైన హీరోనే. అమెరికా ఆగడాలను అణచివేసే వీరుడా... ఛావెజ్ సాగిపో మునుముందుకు... మేమూ నీతోనే అని అనాల్సిస్తుంది ఆ వ్యాసం చదివినవారికి. పాత తరహా సోషలిజాన్ని 21వ శతాబ్దానికి అనుగుణంగా కొత్త తరహా సోషలిజంగా అభివృద్ధి చేయాలన్న ఛావెజ్ ఆకాంక్ష బాగుంది. అలాంటి మార్పుకి కమ్యూనిస్టులు కృషిచేయాలి.

-మాన్యపు భుజేందర్, పాలకుర్తి

ఉప్పొంగిపోయాం

ఆదివారం అనుబంధం కవర్‌స్టోరీ చదువుతుంటే మా ఒళ్లు ఉప్పొంగిపోయింది. మన దేశంలో కూడా ఇలాంటి నాయకత్వం వస్తే బావుండేది అనిపించింది. ప్రత్యక్షదైవాలు(రియల్‌స్టోరీ), కార్టూన్‌లు, తెగిన శారదవీణా తంత్రి(కవిత) చాలా బాగున్నాయి.

-కె కోటేశ్వరరావు,

జానకిపురం, ఖమ్మంజిల్లా

ఆలోచింపజేసింది

ఆదివారం అనుబంధంలో వస్తున్న విషయాలు ఒకదానిని మించి ఒకటి వస్తూ ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా 'సాగిపో ఛావెజ్' కవర్‌స్టోరీ, వర్తమాన ప్రాపంచక శిఖలమీద వికసించిన ఎర్రమందారమా' గేయం ఈ సంచికకు హైలైట్.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,

ఎనికేపాడు. విజయవాడ రూరల్

సిరిసిల్ల, కరీంనగర్‌జిల్లా

కలర్ టీవీ ఇంట్లో కొచ్చి...



ఈ వారం ప్రచురించిన టీవీ పై కథ వాస్తవికంగా వుంది. టీవీని అమ్మేసినా చేసిన అప్పులు తీరవు అంటూ దుర్గయ్య-పున్నమ్మల కుటుంబపరిస్థితి వివరించిందా కథ. నేడు జరుగుచున్నవాటికి దర్పణం ఆ కథ. ప్రత్యక్ష దైవాలు, ఢిల్లీలో పదిరోజులు రచనలు బాగున్నాయి. అనుబంధంలో అన్ని విషయాలూ విజ్ఞానదాయకంగా ఉంటున్నాయి.

-కె యం ముంతాజుద్దీన్,

సిరిసిల్ల, కరీంనగర్‌జిల్లా

రియల్ దైవాలు

రియల్‌స్టోరీలో వివరించిన వాస్తవసంఘటన మమ్మల్నెంతో ఆకర్షించింది. అనాథలైన పిల్లలిద్దరినీ బంగారయ్య దంపతులు ఆదరించిన విధం మా హృదయాలను ద్రవింపజేసింది. ఇంటి సంగతుల్లో రకరకాల సేల్సుమేన్‌లు ఎలా మోసాలు చేస్తున్నారో వివరించడం బాగుంది. నువ్వడ్డి శీర్షికలో మందుల పంటలొద్దని చెప్పడం బాగుంది. పుస్తకపరిచయంలో జోగిని వ్యవస్థ గురించి బాగా రాశారు. మొత్తం అనుబంధంలోని అంశాలన్నీ చక్కగా ఉన్నాయి.

-ఎం లలిత,

కంచరాం, శ్రీకాకుళంజిల్లా

తెగిన శారదవీణా తంత్రి

13 మార్చి నాటి అనుబంధంలో జి.విజయలక్ష్మి గారు రచించిన తెగిన శారదవీణా తంత్రి కవిత మనసుకు హత్తుకునేలా ఉంది. దానికి అనుగుణంగా వేసిన బొమ్మ కూడా ఎంతో మ్యాచింగ్‌గా ఉంది. కవిత, బొమ్మా ఒకదానికొకటి పోటీ పడుతున్నట్లుగా ఉంది. కవిత చదువుతూ బొమ్మ చూస్తూ ఉంటే అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. ప్రచురించిన సందేదేస్కు, బొమ్మ వేసిన వారికి ధన్యవాదాలు. ఇలాగే సామాజిక స్పృహ ఉన్న మరిన్ని కవితలు మీ (మా) సంచికలో రావాలని ఆశిస్తూ.

కె.ఆర్. ఎం, హైదరాబాద్.

ఐ రోబో బాగుంది

6వ తేదీ సంచిక కవర్‌స్టోరీ 'ఐ రోబో' రోబోట్ల గురించి చాలా బాగా వివరించారు. ఆ కవర్‌స్టోరీ చాలా విజ్ఞానదాయకంగా ఉంది. మనలోమాట, బాలలకథ, కార్టూన్‌కదంబం, కళాసాహితి బాగున్నాయి.

-గోరంట్ల బాబాకృష్ణ,

నక్కబొక్కలపాడు.

మనలోమాట

పోయినోళ్లందరూ...

మనిషి పుట్టింతర్వాత

ఎప్పుడో ఒకప్పుడు గిట్టక తప్పదు!

కాలంచేసిన వ్యక్తి ప్రముఖుడైతే - మనం కవులూ రచయితల కేటగిరీలో వున్నం గనుక మన ప్రగాఢ సంతాపం కూడా పకడ్బందీగా వుండాలి!

లేకపోతే -

మన మీద దుమ్మెత్తిపోస్తారు!

కథో కవిత్వమో అయితే... కిందామీదాపడి పూర్తి చేస్తాం. స్వర్గస్తుడైన ప్రముఖుడు గురించి అప్పుడే రాసి అప్పుడే పేపరుకివ్వాలంటే ఎట్లా వీలవుతుంది!

రాసే నాలుగు వాక్యాలూ...

అద్భుతంగా రాయాలి!

ఆ వేళకి రాసే మూడ్ ముచ్చటగా వుంటుందో... ముదనష్టమవుతుందో ఎట్లా చెప్పగలం?

అంచేత-

అతి త్వరలో కాలం చేసే అవకాశం గట్టిగా వుందని దవుటు కలిగించే ప్రముఖుల లిస్టు మన దగ్గిరుంచుకోవాలి!

ఆ లిస్టులో వున్నవాళ్ల గురించి -

అద్భుతమైన వాక్యాలూ... పకడ్బందీ పద్యాలూ - బాగా టైం తీసుకుని ముందే రాసుకుని జాగ్రత్తపడితే మనల్ని చరిత్ర క్షమిస్తుంది.

మన లిస్టులో వున్న ప్రముఖుడు పోగానే - అతని గురించి రాసి పెట్టుకున్న స్క్రిప్టు అదే క్షణం పేపరుకి పంపించాలి. ఆశువుగా రాసినా అద్భుతంగా రాసేవని మనకి మంచిపేరు వస్తుంది!

నా సన్నిహితుల్లో ఈ టైపు రచయిత ఒకే ఒక్కడున్నాడు!

మొన్నామధ్య అతనింటికీ వెళ్లాను. స్నానం చేస్తున్నాడని చెప్పారు. ఏమీతోచక అతని టేబుల్ మీదున్న ఫైళ్లు చూస్తున్నాను!

'సంతాపాలు' అని రాసివున్న ఫైలు నా కంటబడింది!

అందులో డజను మంది ప్రముఖులకు సంతాపాలు రాసి పెట్టివున్నాయి.

నా గురించి కూడా 'సంతాపం' రాసివుంది!

ఏ మాటకామాట చెప్పుకోవాలి. అతను నన్ను బతికుండగానే చంపేసిన సంతాపవాక్యాలు మాత్రం అతిశయోక్తులతో అద్భుతంగా వున్నాయి!

కాకపోతే -

అతను రాసినట్టు నేనంత మంచి వెధవనా అనే దవుటు నాకే కలిగేలా రాసేడు. పోయినోళ్లందరూ మంచోళ్లనే సూక్తి ఇందుకే పుట్టిందేమో? ★

ఈ సంచికలో . . .

ఓరా! . . . 3
కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 5
జీవనశైలి . . . 10
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతి సంగతి . . . 16
నువ్వాద్ది . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 21
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

ఓ తాళిబొట్టు... నేతి అరిశెముక్క

కథ ... 8, 9



అంధుని నృత్యం

రియల్ స్టోరీ ... 14, 15



గులాబీరంగు అందాల జైపూర్

టూరిస్ట్‌గైడ్ . . . 21



శ్రీ కాట్రగడ్డ మధుసూధనరావు

కళాసాహితి . . . 22, 23

గుండెల్లో ఉన్నారో లేదో చూసుకోండి!

ఢిల్లీ అన్నయ్యలు ఎంతైనా బహుత్ చాలూగాళ్ళు. అందుకే ఇటీవల బహుజోరుగా జరిగిన వేలెంటెయిన్స్ డే నాడు పార్కులెంబడి ఓ అబ్బాయి. స్కెత్‌స్కోపులు పుచ్చుకుని అమ్మకానికి బయలుదేరాడు. చౌక చౌక అనరుస్తూ మరీ అమ్మాడుట! లవ్వర్స్ డే డిస్కౌంటు అని కూడా అన్నాడుట. చెరొకటీ కొనుక్కుని చెవులకు తగిలించుకుని ఒకరి గుండె శబ్దాలను మరొకరు వింటూ ఆదో ఆనందం అనుభవిస్తారని ఆ అమ్మే అబ్బాయి లేటెస్ట్ సేల్స్‌టెక్నిక్. "ఎ స్టెతస్కోపు లవ్ స్టోరీ" అని ఎవరన్నా కొత్త టైటిల్ కూడా పెట్టారన్నా వింతేమీ లేదుమరి. వ్యాపారానికి లేదనర్హం అంటారందుకే!

పదిపైసల కడప దోశె

యాభైఏళ్ల క్రితం సుబ్బమ్మ అనే ఆవిడ తన ఇద్దరు కొడుకుల్ని వెంటబెట్టుకుని కడప టౌనుకొచ్చింది మొదలు అణాకొక దోశె షాపు పెట్టింది. ఎంత చౌకో అంత రుచీగా చేసే కడప సుబ్బమ్మ దోశెల సాంప్రదాయాన్నే నేటికీ ఆమె కొడుకులు కొనసాగిస్తున్నారు. కాకపోతే పదిపైసలకొక దోశె అంటున్నారు. అణా, అర్ధణా, కానీ అంటేనే మనకు తెలవదు. పదిపైసలంటే మన పిల్లలకు తెలవదు. కానీ కడప వాళ్ళు పదిపైసలంటే మునిరెడ్డి దోశె అని ఠక్కున చెప్పేస్తారు. ఐదు కమ్మటి కడపదోశెలు లాగించావంటే చాలు ఇక ఆ పూటకి! అర్ధరూపాయికి కడుపునిండా టిఫిన్ పెట్టే దాతెవరయ్యా అంటే మునిరెడ్డి, పుల్లారెడ్డి ఫామిలీస్ అని చెప్పాలి. మరింతటి పలహారానికి మూడురకాల చెట్నీలు ఫ్రీ. "కడప అంటే ఫణామని పేలే బాంబులే అనుకుంటున్నారా...? ఆకలి తీర్చే వేడి దోశె అనుకోవాలి" అని మునిరెడ్డి కుటుంబం తపించిపోతోందేమో!

చిత్రకళా గజమహాన్‌లు



"ఓ బొమ్మగీసి ఫోజులు కొట్టేది మనుషులేనేంటి? మేమూ కొడతాం ఫోజులు...తీసుకోండి ఫొటోలు" అనంటున్నాయి ఈ థాయ్‌లాండ్ ఏనుగులు. ఛియాంగ్ మాయ్ ప్రావెన్సీలో ఉన్న ఈ పెంపుడు ఏనుగులు ఎనిమిది కలిసి ఒకే కాన్వాస్ మీద ఆక్రలిక్ కలర్స్‌తో 2.4 మీటర్ల ఎత్తు, 6మీటర్ల పొడవున్న పెయింటింగ్ వేసేసి గిన్నీస్ బుక్ వాళ్ళనొచ్చి చూస్కోండంటున్నాయి. వారెవ్వా... గజరాజాస్... వారెవ్వా!




సిట్ స్టాండ్...
ప్రభుత్వం
పార్టీ
వైఎస్ కో-ఛైర్మన్‌గా ప్రభుత్వం, పార్టీకి మధ్య సమన్వయ కమిటీ
నారు


ఎన్‌కౌంటర్లు వద్దు
వీరిద్దరూ వద్దు శాంతి కావాలి
ఆయుధాలు వద్దు
మావోయిస్టుల ప్రతినిధులు
పోలీసులు

కార్టూన్ కదంబం


అప్పుడు:
అమెరికా వాళ్లు నా బట్టలు విప్పించడంలో తప్పేంలేదు, బాగు బాగు
ఇప్పుడు:
మోడీకి అమెరికా వీసా నిరాకరించడం ఇండియాకు అవమానకరం

వన్స్‌మోర్...
నాటకం వర్ధిల్లుతుంది

నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం. యునెస్కో ఇచ్చిన పిలుపుతో నేడు 40వ రంగస్థల పండుగ జరుగుతోంది. ఏ ఇతర కళారూపం కన్నా నాటకరంగానికే ప్రేక్షకులతో అత్యంత సజీవబంధం ఉంది. నటుల నటన-చూసేవారి స్పందన ఏకకాలంలో జరిగేది ఇక్కడే. అందుకే రంగస్థలం సజీవమైనది, మానవీయమైనది, సామాజికబాధ్యత కలది కూడా. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పాటిస్తూ ఈ కవర్‌స్టోరీ అందిస్తున్నాం.

అమృత

సునామీ లాంటి ప్రళయం మానవకోటిని మట్టుపెట్టి చివరకు ఓ తల్లీబిడ్డను మిగిల్చినా... నాటకరంగం బతికి బట్ట కట్టినట్టేనట! ఆ తల్లి "ఓచిలే... ఓచిలే..." అంటూ బిడ్డను లాలిస్తే అందులో ఒకరు నటులు, మరొకరు ప్రేక్షకుడట! ఎంత విచిత్రం!! ఆ చిన్నారి బోసినవ్వుల్లో పదహారు లోకాలూ చూడగలదట!!! అందుకే 'సర్వకళల సమాహారమే నాటకం'.

మొదట నాటక రచనలు సంస్కృత భాషలోనే జరిగాయి. భానుడు, అశ్వమేఘుడు, కాళిదాసు, హర్షవర్థనుడు, విశాఖదత్తుడు, భట్టు నారాయణుడు వంటి కవులు సంస్కృత భాషలో నాటక కావ్య రచనలు చేశారు. నృత్యంతో మొదలైన నాటకాలు చిన్నచిన్న కవితలు, పదాలు, సంగీత ప్రధానమైన పద్యాలతో కొనసాగాయి. రెండువేల సంవత్సరాలకు పూర్వం వరకు సంస్కృత భాషకే పరిమితమైన నాటకం ఎట్టకేలకు తెలుగుదనాన్ని సంతరించుకుంది. తెలుగు పద్య నాటక రంగం దశాబ్దాల పర్యంతం ఆంధ్ర ప్రజలను సంగీత మాధుర్యంలో ఓలలాడించింది. నటీనటులు తమ సుమధుర గానంతో ప్రేక్షకులను రంజింపజేశారు. రాగాలాపనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి "వన్స్‌మోర్... వన్స్‌మోర్..." అని బతిమాలించుకున్నారు.

నాటక ప్రక్రియ-నూతన పోకడలు

ప్రజా జీవనంతో పెనవేసుకుని నడక సాగిస్తున్న నాటక రంగంలో కాలానుగుణంగా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పోకడల్లో నూతనత్వం చోటు చేసుకుంది. ప్రజల వద్దకే నాటకరంగాన్ని చేర్చే ప్రక్రియలో భాగంగా వీధి నాటికలు ఆవిర్భవించాయి. రెండో ప్రపంచ యుద్ధం ముగిసి జర్మనీ ధ్వంసమైన సమయంలో ఆ దేశానికి చెందిన 'బెర్టోల్డ్‌బ్రెఫ్ట్' వీధి నాటికల ప్రక్రియను సద్వినియోగం చేసుకున్నాడు. ప్రజారంగస్థలానికి చెందిన అనేక సైద్ధాంతిక విషయాలను ప్రతిపాదించారు. ప్రపంచ రంగస్థలాన విలియం షేక్స్‌పియర్, బెర్నార్డ్ షా, బ్రెఫ్ట్, స్టాన్‌స్లావిస్కీల నుంచి నేటి అగస్తోబోల్, జాయ్ బారియస్ వరకూ ఎందరో అనేక మార్పులను పొందుపర్చారు. వాస్తవానికి వీధి ప్రదర్శనలు భారతదేశానికి కొత్తేమీ కాదు, దేశంలో అనాదిగా ఉన్న పలు ప్రజా కళలు వీధి ప్రదర్శనలే.

అదిగో... అల్లదిగో...

మన దేశంలో 1880లో మహారాష్ట్ర నుండి తరలి వచ్చిన సీతారాంజోషి హిందూ డ్రమటిక్ కంపెనీని



ఈ ఏడాది సందేశమిచ్చిన ఫ్రెంచి నాటకదర్శకురాలు

ప్రపంచ రంగస్థల సంస్థ(ఐటిఐ) 2005వ సంవత్సర రంగస్థల దినోత్సవ సందేశం(40వ సందేశం) ఫ్రాన్స్ దేశానికి చెందిన నాటక దర్శకురాలు ఎరియన్ మ్నౌష్కిన్ చేత ఇప్పించారు. 1964లో మ్నౌష్కిన్ తన బృందంతో 'థియేటర్ ఆఫ్ సన్' అనే రంగస్థల సంస్థను ఏర్పాటుచేశారు. మొదటి ప్రదర్శనగా గోర్కి రాసిన 'పెటిట్స్ బూర్జువాయిస్' ఆధారంగా ఆర్థర్ అడమోవ్ నాటకాన్ని ప్రదర్శించిన టీమ్ ఆమెది. పారిస్‌లో జరిగే ఉత్సవంలో ఈరోజు ఆమెకు పికాసో అవార్డుతో సత్కరించనున్నారు. ఆమె తన సందేశం ఒక కవిత రూపంలో ఇచ్చారు.

రక్షించు !

రంగస్థలమా...నన్ను రక్షించు
గాఢనిద్రలో ఉన్న నన్ను మేల్కొల్పు
గాఢాంధకారంలో
తప్పిపోయాను...దారిచూపించు...కనీసం కొవ్వొత్తి
దాకా...
సోమరిని కదా...నన్నసహ్యించుకో
అలసిపోయిన నన్ను ఉత్తేజపరుచు
ఉదాసీనంగా ఉన్నందుకు కొట్టు
కొట్టినా ఉదాసీనంగా ఉన్నందుకు బాదు
భయపడుతున్న నన్ను ఉసిగొల్పు
విస్మృతుణ్ణి కదా బోధించు
రాక్షసుణ్ణయిపోయా...మనిషిని చెయ్
డాంబికాలు ప్రదర్శిస్తా...మేక్ మీ డై ఆఫ్
లాఫర్-నవ్వులపాల్జేయి
నేను నీచుణ్ణి...అందుకే అవమానించు
నేనొక శుంఠను...నన్ను మార్చుకో
పాపిని...శిక్షించుకో
క్రూరుణ్ణి, అధిపతిని...నాకు వ్యతిరేకంగా పోరాడు
ఛాదస్తపోడిని...హేళన చెయ్
సభ్యతలేనివాడినని నన్ను ఉద్ధరించు
మూగవాడిని... నా నాలుకను సవరించు
నాకే స్వప్నాలూ లేవు...పిరికిపందనను
నా మతిమరుపు ముఖాన ఇంత జ్ఞాపకాన్ని విసురు
వృద్ధుణ్ణనుకుంటున్నాను...నాకు పాకే పసిదనాన్నివ్వు
నేనొక బండరాయిని...సంగీతస్పర్శనివ్వు
విషాదనిషాదాన్ని...సంతోషతిమిరాన్ని చెయ్
చెవిటివాడినైన నా చెవులకు తుపాను పెనువీచికల
శబ్దానివవ్వు
ఆందోళన చెందిన నా మనస్సుకి వివేచననివ్వు
బలహీనుణ్ణి...నాకు సాన్నిహిత్యాన్నివ్వు
అంధుడను...నాకు అన్ని వెలుగులు వశపర్చు
ఈ అందవిహీనుణ్ణి సౌందర్యోపాసకుణ్ణి చెయ్
ద్వేషంతో రగిలిపోతున్న నన్ను అవధుల్లేని
ప్రేమానురాగాలలో ముంచేసేయ్

వెబ్‌సైట్‌లోని ఆంగ్ల
కవితాసందేశానికి అనువాదం:
- ఉదయశంకర్

మన రాష్ట్రంలో స్థాపించి బళ్లారి, కర్నూలు, ఆదోని, రాయదుర్గం, ప్రాంతాల్లో తెలుగు నాటకాలు ప్రదర్శించారు. శీతారాం జోషి స్థాపించిన సంస్థను 'ధార్వాడ కంపెనీ'గా ప్రచారంలోకి వచ్చింది. ఈ దశలో కందుకూరి వీరేశలింగం పంతులు విద్యార్థి నాటక సమాజాన్ని స్థాపించారు. సంస్కృత నాటకం 'రత్నావళి' తెలుగులోకి అనువదించి రాజమహేంద్రవరంలో తొలిసారిగా ప్రదర్శించారు. ఆంధ్రనాటక రంగ చరిత్రలో మొదటి వేషధారులైన సోమంచి శంకరం, అడవికొల్లు కనకరాజులకు ప్రజలు నీరాజనాలు పలికారు.

చెల్లియో...చెల్లకో...

ధర్మవరం కృష్ణమాచార్యులు కృషి వల్ల నాటకాల్లో పాటలు ప్రవేశించాయి. 1928 నుండి కాంట్రాక్టు నాటక యుగం ఆరంభమైందని చెప్పొచ్చు. విదేశీపర్యటన ముగించుకుని వచ్చిన బళ్ళారి రాఘవ సాత్వికాభినయం ప్రవేశపెట్టడంతో నాటకరంగం కొత్తమలుపు తిరిగింది. దశాబ్దాల పర్యంతం గ్రామగ్రామాన అలరించిన పద్యనాటక రంగం క్రమేపీ తన వైభవాన్ని కోల్పోయింది. కారణాలేమైనా దశాబ్దాల పర్యంతం అలరించిన పద్యనాటకం క్రమేపీ కనుమరుగవుతున్న ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతి పురాతనమైన పద్య నాటక రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు అందరిపైనా ఉంది. ఎందుకంటే నాటకంలో పద్యాలు, రాగాలు, వాటి విరుపులు ఒక్క మన తెలుగు కళారూపంలో తప్పితే మరెక్కడా లేదు. వాటి ప్రభావం ఇప్పటికీ గ్రామాలలో చూడవచ్చు. నిరక్షరాస్యుడు సైతం "చెల్లియో...చెల్లకో" అని రాగాలు తీయడం మనం చూడవచ్చు. "ఇచ్చోటనే...సత్కవీంద్రుల కమ్మని కలము నిప్పులలోన కరిగిపోయే...", "బాల కోటిసూర్యప్రభా ఖచితంబై వెలుగొందుచున్నయదీ...నీ మాంగల్యం కాబోలు" అని హరిశ్చంద్ర నాటక పద్యాలు అలవోకగా పాడుతూ

సురభి కళాకారులు

ఆంధ్రనాటక రంగ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యం వహించే సురభి నాటకాల చరిత్ర ఆంధ్రులందరికీ పరిచయమైనదే. సురభివారి కళాత్మక చరిత్ర రాస్తే అదొక అద్భుత పురాణగాథ అవుతుంది. అంతటి కళాసేవా చరిత్ర దానికుంది. ఏ కంప్యూటర్, డిజిటలైజ్ టెక్నిక్‌లు లేకుండానే కళ్ళెదుట తమ ప్రతిభతో అబ్బురపరిచే టెక్నిక్‌లు ప్రదర్శించగలరు. తోలుబొమ్మల ఆటలవారూ ఏ మహారాష్ట్రులో, ఈ సురభి నాటక కళాకారులు కూడా ఆ మహారాష్ట్రులే. సురభి కళాకారులు ఆంధ్రనాటక రంగానికి అపారమైన సేవ చేశారు. కేవలం భుక్తి కోసమేకాక కళాతృష్ణతో వారు నాటకాలను ప్రదర్శించారు. కుటుంబాలకు కుటుంబాలే ఆంధ్రదేశపు నాలుగు చెరుగులా విస్తరించి నాటక రంగానికి బహుముఖాలా సేవచేశారు. బాల వేషాల్లో పేరుతెచ్చుకున్న సురభి కమలాబాయి యుక్త వయస్సులో కథానాయిక పాత్రలను పోషించారు. ఆ తర్వాత తెలుగులో మొట్టమెదటి టాకీ (1931) భక్తప్రహ్లాద చిత్రంలో ఆమె లీలావతిగా నటించారు. ఆమెకే కాదు, దాదాపు సినీనటులందరికీ నాటకరంగం పుట్టిల్లే.

చేనుగట్లపై వెళ్ళేవాళ్ళను చూడవచ్చు.

సమాజహితం కోరిన నాటకం

ప్రస్తుతం సమాజ శ్రేయస్సు ప్రధానాంశంగా నాటకరంగం విరాజిల్లుతోంది. సాంస్కృతిక కళల ద్వారా సామాజిక చైతన్యం కలుగుతుందనే వాస్తవాన్ని చరిత్ర మనకు ఎన్నోసార్లు విశదపరచింది. ఫ్రెంచి నాటక రచయిత శామ్యూల్ బెకెట్ రచన 'వెయిటింగ్ ఫర్ గోడో' కు సాహిత్యపరంగా ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి లభిస్తే, మన దేశానికి చెందిన నాటక రచయిత నటుడు గిరీష్‌కర్నాడ్‌కు ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ అవార్డు లభించటం నాటక రంగానికున్న ప్రాముఖ్యత, ప్రాచుర్యం స్పష్టం చేస్తుంది. భారతదేశంలో మరాఠీ, కన్నడ, తమిళ, బెంగాలీ నాటకరంగాలకు నేటికీ ప్రజాదరణ తగ్గలేదు. గిరీష్‌కర్నాడ్, బి వి కారంత్, ప్రసన్న, బాదల్ సర్కార్, బబ్బన్‌ఖాన్, చో, వంటి వారు ఎందరో నాటకరంగం ద్వారానే గుర్తింపు పొందారు. ఇండియన్ పీపుల్స్ థియేటర్(ఇప్టా) దాని పునాది ప్రజానాట్యమండలి రంగస్థలాన్ని ఒక్క కుదుపు కుదుపింది. "మా భూమి" నాటకం వందలాది బృందాలు ప్రదర్శించి ప్రజారంగస్థలానికి ఒక నమూనా చూపింది. ఆ తరువాత ప్రజాకళారంగం ఒక ఉద్యమంలాగా వీథిరంగస్థలాన్ని సాగించింది. మరోపక్క సాంఘిక నాటకరంగం నాటక పరిషత్తుల నిర్వహణతోనే ఊపిరి తీసుకుంటోందని చెప్పాలి. అలా తెలుగు నాటకం నాటక పరిషత్తుల చట్రంలో బిగుసుకుపోయి బతుకుతోందనే విమర్శ లేకపోలేదు.

నాటకాలకు హాజరవుతున్న ప్రేక్షకులు రాష్ట్రంలో నాలుగు లక్షలకు మించి లేరు. రాష్ట్రంలో దాదాపు పదికోట్ల మంది జనాభాలో కేవలం నాలుగు లక్షల మంది మాత్రమే నాటకాన్ని చూస్తే సరిపోతుందా? నాటక రంగాన్ని ఎక్కువమంది ప్రజల దగ్గరకు చేర్చేందుకు కృషి జరగాల్సిఉంది. ఆ పని కేవలం వృత్తికళారంగం కంటే ఉద్యమకళారంగం చేయగ లుగుతుంది. ★

రంగస్థలం కొనసాగుతుంది

-గిరీష్‌కర్నాడ్

"నాట్యశాస్త్రం" అనే గ్రంథం రంగస్థలం గురించి ప్రపంచంలోనే తొలినాటి ప్రామాణిక గ్రంథం. క్రీ.పూ. 3వ శతాబ్దపు మొదటిరోజుల్లో డ్రామా పుట్టినట్లు ప్రస్తావనలున్నాయి. ఆనాటి సాహిత్యకారులు చతుర్వేదాలనుంచి పంచమవేదాన్ని రూపొందించారని, అది ప్రదర్శనాత్మకమైనదని ఓ కథనం ఉంది. భరతుడు అతని నూరుగురు కుమారుల ద్వారా ఈ నాటక నియమనిబంధనలు సమాజంలో అమలులోకి వచ్చాయని చెబుతున్నారు. నాటి సమాజంలో చెడుని విడనాడి మంచిని అనుసరించాలని బోధించడానికి దృశ్యకళగా భరతుడి నాటకం రూపొందిందని మనం అనుకోవచ్చు. నేటి ప్రపంచముందున్నంత డ్రామా నాడు లేదు. రేడియో, సినిమా, టెలివిజన్, వీడియోలాంటి అత్యున్నత ఎలక్ట్రానిక్‌మీడియాల ద్వారా డ్రామా మనల్ని ముంచెత్తివుంది. ఏదిఏమైనప్పటికీ...నాటకం అనేది రంగస్థలంలో నాటకకర్త, ప్రదర్శకుడు, ప్రేక్షకుల అవిచ్ఛిన్న సంబంధంతో నిర్వర్తించేది. కానీ ఈ మూడింటిలో ఒకటి ఎప్పుడూ అనిశ్చితంగా ఉంటోంది. కుదుపులకు గురౌతోంది. ఎందుకనోగానీ రంగస్థలం పదిలంగా ఉండాలని ప్రయత్నించినప్పుడల్లా దాని మృత్యుఛాయలు కనబడుతున్నాయి. దాని భవిష్యత్తు నిస్తేజంగా కనబడినప్పటికీ రంగస్థలం బతికే ఉండి మనల్ని ఉత్తేజపరిచేందుకు కొనసాగుతూనే ఉంటుందనడానికి ఇదే కారణం అని ఎందుకనుకోకూడదూ అన్నది నా వాదన.

(2002 సంవత్సర రంగస్థల దినోత్సవం నాడు మన భారతీయ నాటకకర్త ఇచ్చిన సందేశం నుంచి)

మార్క్సిజానికి మరణంలేనట్లే రంగస్థలానికీ లేదు

"అసలు నాటకాలు ఎందుకు వేయాలి. ఈ కష్టం మరో రంగంలో పెడితే డబ్బులు, సౌకర్యాలు అన్నీ దొరుకుతాయి కదా?..." ఈ ప్రశ్న మన దగ్గరే కాదు. ప్రపంచవ్యాప్తంగా నాటకరంగంలో పనిచేస్తున్న కళాకారులందరినీ అనేక సందర్భాల్లో వెంటాడుతూనే ఉంది. ఈ మధ్యనే నా మిత్రుడు అమెరికాలో అనేక నగరాల్లో నాటకబృందాలతో తిరిగి తిరిగి హైదరాబాద్ వచ్చి చెప్పిన అనుభవాలు చాలా ఆశ్చర్యపరిచాయి. ఇక్కడిలాగే అక్కడా కనీససౌకర్యాలు లేక కళాకారులు ఇబ్బందులు పడుతున్నారు. నాటకాలకి డబ్బులు దొరక్క నానాఅగచాట్లు పడుతున్నారు. ఇదంతా దేనికి చేస్తున్నానని అనేక సందర్భాలలో అలజడికి గురౌతున్నారు. పోనీ నాటకాలు వేయడం తప్ప వీళ్ళకు వేరే ఏ పనీ చేతకాదా అనంటే... అదీ లేదు. అందరూ చదువుకున్నవారే. టీవీల్లోనో, సినిమాల్లోనో, వినోదపర్యాటక రంగంలోనో ఎక్కడోచోట మంచి స్థాయికి వెళ్ళగలిగిన వాళ్ళే. కొందరు ఆ రంగాల్లో జీవనభృతి సంపాదించుకుంటూ నాటకాలు వేస్తుంటే, కొందరు నాటకాలే సర్వస్వంగా బతుకీడుస్తున్నారు. నాటకంలోని ఏ అంశాలు వీళ్ళను ఇంత కష్టానికీ, త్యాగానికి పురిగొల్పుతున్నాయని ఆలోచిస్తే, కేవలం నాటకం వేయడంలో ఉన్న "ఆనందం" కోసమే ఇదంతా. అదే ఇన్ని దేశాలలోని ఇన్ని వేలమంది ఇంకా నాటకాల పట్ల ఆకర్షితులవ్వడానికి, వేయడానికి కారణం. నాటకం పట్ల ఇంత ప్రేమ కలగడానికి, ఇంతటి ఆనందం పొందడానికి వెనుక అనేక సామాజిక కారణాలు కూడా ఉన్నాయి. నాటకరంగంలో ఉన్న భావప్రకటనా స్వేచ్ఛ వాటిల్లో ఒక ప్రధానమైన కారణం. సినిమా నిర్మాణంతో పోల్చుకుంటే ఆర్థికంగా ఇంకా మేధావి వర్గానికి నాటకరంగం అందుబాటులో ఉండటం, తీరిక సమయాలలో అందరూ కలుసుకునే అవకాశం, అన్నిటికీ మించి సామాజిక అంశాలకు, ఉద్యమకారులకు నాటకం మంచి ఆయుధంగా ఉపయోగపడటం లాంటి అనేక కారణాలున్నాయి. ఈ కారణాలే నాటకాన్ని బతికిస్తున్నాయి.

నాటకాన్ని రాజకీయ ప్రయోజనంతో ముడిపెట్టిచూసే వామపక్షరంగస్థలానికి ఈ బాధ లేదు. విప్లవభావజాలం ఈ రంగస్థలానికి వెన్నుముక. కనుక ఆ భావజాలం ప్రాచుర్యంలో ఉన్నంతకాలం ఈ రంగస్థలం కొసాగుతూనే ఉంటుంది. మార్క్సిజానికి మరణం లేదన్నట్లే ఈ తరహా నాటకానికి కూడా మరణం ఉండదు.

-పెద్ది రామారావు, యవనిక(రంగస్థల పత్రిక) ఎడిటర్

బెర్నార్డ్ షాతో బళ్లారి రాఘవ

1928లో రాఘవ పాశ్చాత్య నాటక కళారీతుల అధ్యయనానికై ఇంగ్లండు, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో పర్యటించారు. విఖ్యాత నాటకకర్త జార్జి బెర్నార్డ్ షాను కలుసు కున్నారు. పది నిమిషాలు మాత్రమే మాట్లాడే వీలుంటుం దన్నారు బెర్నార్డ్ షా. అలాంటిది ఇద్దరి మధ్య సంభాషణ ఎనభై నిమిషాలకు పైగా జరిగింది. 'మర్చెంట్ ఆఫ్ వెనిస్' నాటకంలోని ఒక సీన్‌ను బెర్నార్డ్ షా కోరికపై రాఘవ ప్రదర్శించారు. ముగ్ధుడైన షా ఎంతో గొప్పగా ఉందంటూ రాఘవను ప్రశంసించారు.

ఓ తాళిబొట్టు... నేతి అరిశెముక్క

ఎం. రాజేశ్వరి

'ముసల్ది చచ్చిపోతుందేమో!' కుక్కిమంచంలో ముడుచుకుని పడుకుని ఉన్న ముసలామెను చూస్తూ నిట్టూర్చింది రంగమ్మ.

ఎండిపోయి పుల్లల్లా ఉన్న చేతులు ఒక పక్కగాపడిఉన్నాయి. కప్పిన చీర ముక్క తప్ప ఆమె ఒంటిపై ఇంకేమిలేదు. ఎక్కడా కదలిక లేదు. అనుమానమొచ్చి 'అత్తమ్మా'! అని ముసలమ్మను పిలిచింది రంగమ్మ. పలకలేదు. దాంతో మనసు కీడు శంకించింది. భయంతో కంగారుగా ఆమెను తట్టింది.

ఎప్పటికో... 'ఊ' అని మూలుగుతూ గాజు గోళీల్లా ఉన్న కళ్లను బలవంతాన ఎత్తి చూసింది. మళ్లీ కళ్లు మూసుకుంది.

మరుక్షణమే మెలకువ వచ్చినట్లుగా 'ఓర్నా కొడకో – ఎటెల్లిపోనావురో! నన్నొదిలేసి నీ దార్న నీవు పోయినావా కొడకా... కొడకా!" అంటూ అప్పటికి వారం నుంచి కన్పించని కొడుకుని తల్చుకుని ఏడవసాగింది.

రంగమ్మకూ కడుపులోంచి ఏడుపు తన్నుకొచ్చింది. భోరున ఏడవాలని ఉంది. ఊహు – ఓపిక లేదు. లోలోపల బాధ సుడులు తిరుగుతున్నా కళ్ల నుంచి నాలుగు చుక్కలే రాలి నేలపై పడ్డాయి. శరీరాన్ని మరింత నిస్సత్తువ ఆవరించింది. నీరసంగా కుక్కిమంచానికి చేరగిలపడి శూన్యంలోకి చూస్తుండి పోయింది. భర్త సారయ్య ఎక్కడున్నాడో... ఏం చేస్తున్నాడో...?

వరుసగా పదేళ్ల నుంచి పంటలు లేకపాయె... ఉన్న పొలం అంతా కరిగిపాయె... రైతు కాస్తా కూలీగా మారాడు. అయినా మధ్య తరగతి మనస్తత్వం మాత్రం మారలా... నేనూ వస్తానయ్య కూలీకి అంటే విన్నాడుకాదు. పూట గడపాలంటే ఎన్ని పాట్లు...

ఇద్దరి కూతుళ్ల పెళ్లి చేసేసరికి ప్రాణం గుడ్లనుంచి వెలికివచ్చింది. పోలియో వచ్చిన కొడుకు నిలువెత్తు ఎదిగినా నేలపారాడే బిడ్డడిగానే మిగిలిపాయె. భర్త సారయ్య రెక్కల కష్టమే నలుగురి పొట్టలు నింపాల్సివచ్చింది. వద్దయ్యా! మనకు ఎవసాయం అంటే, కాదు కూడదంటూ పొలం గుత్తకు తీసుకున్నాడు. పుట్టినకాడ అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాడు. వానల్లేక పైరు ఎదగనే లేదు. చివరకు దక్కిన ఆ గింజలనే అమ్మితే ఆ డబ్బు పుచ్చుకుని దళారి పారిపోయాడు. తమలా ఎందరినో మోసగించాడు వాడు. నెత్తీనోరు కొట్టుకున్నా నయాపైసా కూడా దక్కలేదు. అప్పు పెట్టిన పెద్ద మనిషి నలుగురిలోను సారయ్య చొక్కా గుంజి అల్లరిపెట్టాడు. పరువుపోయిందని అల్లాడాడు. బాకీ ఎలా తీర్చాలో అర్థంకాలేదు. తల ఒంచుకుని ఇంటికి వచ్చాడు. ఎవరేమి అడుగుతున్నా విన్పించుకోలేదు. వసారాలోని నులకమంచంపై పడుకుని కళ్లు మూసుకున్నాడు.

'ఏందయ్యా! అలా ఉంటే ఎలా? ఈ గంజి తాగు' అంటూ గిన్నె అందించింది భర్తకు. అడ్డంగా తలవూపాడు. అతని పరిస్థితి చూసి ఆమె గాలి విసురుకు ఎగిరిపోయే ఎండటాకులా అల్లాడింది. ఎంతో ధైర్యం చెప్పాలని ఉంది. కానీ ఏది ఆసరా...?

ఆ రాత్రి నిద్రపట్టక దొర్లుతోంది తాను. కుక్కల అరుపులు విన్పించాయి. ఎందుకో భయంగా అన్పించింది. తటాలున లేచి వసారాలోకి తొంగిచూసింది. మంచంపై సారయ్య కన్పించలేదు. గుండె గుభేలుమంది. వీధిలోకి పరిగెత్తి చూసింది. అల్లంత దూరాన మలుపు తిరుగుతున్న మనిషి రూపం కన్పించింది. అక్కడకు పరుగెత్తి చూసింది. ఎటుచూసినా నిర్మానుష్యంగా ఉంది. పైగా చిమ్మ చీకటి... అవును... చీకటే ఇక మిగిలింది. అప్పుడే వారం రోజులయిపాయె! ఎక్కడున్నాడో... తింటూన్నాడో లేడో... అసలు బతికే ఉన్నాడా...? ఆమె గుండె జారిపోయినట్లయింది. ఛీ...ఛీ... తనకిలాంటి పాడు ఆలోచన వచ్చిందేమిటి...? ఊర్లో అందరూ అదే అనుకుంటున్నా తనకెందుకో నారయ్య బతికి ఉంటే బాగుండునన్పిస్తోంది... ఎప్పటి కయినా తిరిగి వస్తాడనుకుంటే, తనకు బతుకుపై ఆశ పుడుతోంది. వస్తాడు... వస్తాడు... 'రంగమ్మ ఎలా ఉన్నావే ఇన్నాళ్లు నేను లేకుండా' అని అడుగుతాడు చూడు... తనకు తనే ధైర్యం చెప్పుకుంది. చీర కొంగుతో కళ్లద్దుకుంది. నెమ్మదిగా ముసలిదాని వైపు తిరిగింది.

ఓపిక లేని ముసల్ది ఏదో గొణుక్కుంటోంది. ఏమిటా? అని ఆమెపైకి ఒంగి విన్నది.

అంత బాధలోను 'నేతి అరిసె పెడతావటే రంగమ్మా!' ఎక్కడో నూతిలోంచి వచ్చినట్లుంది ముసలిదాని మాట.

గాఢంగా నిట్టూర్చింది రంగమ్మ. ముసల్ది ఎప్పటినుంచో అడుగుతోంది. తనే చేసి పెట్టలేకపోయింది. పరిస్థితులలా వెంటాడుతున్నాయి. ఏం చేయాలో తోచడంలేదు. చివరి కోరిక తీరకుండానే ముసల్ది చస్తే... ఎక్కడో కలుక్కుమంది.

'అత్త ఎట్లా బతికిందని'... ఆమె మనసు గతంలోకి పరుగెత్తింది.

✿ ✿ ✿

ఏడెకరాల పొలం గల రైతు భార్యగా వెంకాయమ్మ పాడీ పంటతో ఉన్నంతలో నిండుగా బతికింది. పెళ్లయిన పదిహేనేళ్లకు సారయ్య పుట్టాడు. బిడ్డకు పదేళ్లు రాగానే భర్తను కోల్పోయింది వెంకాయమ్మ. జీవితాన్ని ఎరిగిన మనిషిగా ఆ ఊరిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా సాయపడేది. పెద్ద దిక్కులా వ్యవహరించేది. ఆ రోజుల్లో ఆమె పొందిన గౌరవాభిమానాలు కూడా ఎక్కువే. అందుకే రంగమ్మను కోడలిగా ఆమె తెచ్చుకున్నా ఎవరూ నోరు మెదపలేదు.

రంగమ్మ అనాథగా ఆ ఊరికి చిన్నప్పుడే వచ్చింది. ఆదరించిన పూజారి వద్దనే ఉండి గుళ్లో పనులు చేసుకుంటుండేది. ఆమె వయస్సుకు రాగానే ఆమె అందచందాలపై కన్నేసిన వాళ్లు ఆమెను బలవంతాన దేవదాసీని చేయాలని పన్నాగాలు పన్నారు. పూజారి ద్వారా అసలు విషయాన్ని తెలుసుకున్న వెంకాయమ్మ అదే గుళ్లో అమ్మవారి మెళ్లోని మంగళసూత్రాన్ని తీసి తన కొడుకు సారయ్యకిచ్చి రంగమ్మ మెళ్లో కట్టమని శాసించింది. ఆ సమయంలో వెంకాయమ్మకు ఏ ఒక్కరూ ఎదురుచెప్పలేదు. అంతేకాదు. సారయ్య-రంగమ్మ దంపతులను ఎంతో ఆదరించారు. అత్తమ్మ అని పిలుస్తూ వెంకాయమ్మలోనే అమ్మను, అత్తను చూసుకుంది రంగమ్మ.

సంక్రాంతి వస్తే చాలు వెంకాయమ్మ సందడి అంతా ఇంతాకాదు. ఆమె వంట చేసిందంటే అందరూ లొట్టలేసుకుని తినేవారు. అందులోను నేతి అరిసెలు ఎంతో బాగా చేసేది. ఆ ఊరి వాళ్లు ఆమెను తీసుకెళ్లి మరీ చేయించుకునేవారు.

✿ ✿ ✿

"అవును. ఎంత కమ్మగా చేసేదో...!" ఆలోచనల్లోంచి బైటపడింది రంగమ్మ.

పదేళ్లుగా తమవి చితికిన బతుకులై పాయె! కొడుకు వెళ్లిపోక ముందు నుంచి 'నేతి అరిసె పెట్టవే!' అని అడుగుతోంది అత్తమ్మ. 'ఏం చేయాలి?' ఆమెకు ఎటూ పాలుపోవడంలేదు.

ఇంతలో పక్కింటి రమణమ్మ వచ్చింది. "ఏమిటి వదిన ముసలిది ఏమంటోంది?" అంటూ ఆమె మంచం దగ్గరకు వచ్చింది.

"పెద్దమ్మా! ఎలా ఉన్నావే?" అంటూ ముసలమ్మను పలకరించింది.

"నేతి అరిసె పెడతావా!" పుల్లలాంటి చేతిని చాపింది ముసలమ్మ. అంతలోనే 'ఓర్నా కొడకో' అంటూ ఏడుపు మొదలెట్టింది. దాంతో కంగారు పడిన రమణమ్మ

"ఇక రేపో, మాపో అన్నట్లుంది ఇపుడేం చేస్తావు వదిన" రంగమ్మనే జాలిగా చూస్తూ అంది.

నిస్తేజంగా ముసలమ్మనే చూస్తున్న రంగమ్మ నిట్టూర్చింది.

"ముసల్ది నేతి అరిసె అడుగుతోంది. నా చేతిలో నయాపైసా లేదు. కుండలో గుప్పెడు బియ్యంలేవు. అప్పుపుట్టే దిక్కులేదు. ఏం చేయాలో తోచడంలేదు.'' తలమీద చేయిపెట్టుకుని కూలబడింది రంగమ్మ.

తలవంచుకుని కూర్చున్న ఆమె కళ్లకు తన ఎండిన గుండెలపై వేలాడుతున్న తాళిబొట్టు కన్పించింది. ఆమె మొహంలోకి జీవం వచ్చింది. అంతలో సారయ్య గుర్తొచ్చాడు. ఒక్క క్షణం తటపటాయించింది. అయినా చటుక్కున మెడలోంచి తాళి తీసింది. రమణమ్మ చేతిలో పెట్టింది.

తాళిని తీసి తనచేతిలో ఎందుకుపెట్టిందో అర్థంకాక బిత్తరపోయింది రమణమ్మ.

''ఈ తాడుకుఉన్న బంగారు రేకును అమ్మి ముసల్దానికి నేతి అరిసె చేసి పెట్టవా!" రమణమ్మ రెండు చేతులు పుచ్చుకుని ప్రాధేయపడినట్లు అడిగింది రంగమ్మ.

కదిలిపోయింది... కళ్లల్లో నుంచి ఉబికి వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ 'అలాగే వదిన' అని చెప్పి రమణమ్మ అక్కణ్ణించి భారంగా కదిలి వెళ్లిపోయింది.

తన పరిస్థితులే రమణమ్మవి కూడా. ఆమె బాధను అర్థం చేసుకుంది రంగమ్మ.

✿ ✿ ✿

ఆ రోజు పొద్దుగూకే వేళకు వచ్చింది రమణమ్మ. ముసలమ్మ మంచం పక్కనే ముడుచుకుని పడుకుని ఉన్న రంగమ్మను తట్టి లేపింది.

'మన సోయలో లేదు' - ముసలమ్మను లేపి తన ఆసరానిచ్చి కూర్చోబెట్టింది.

'ఇదుగో నేతి అరిసె-నోరు తెరు' ముసలమ్మ చెవిలో గట్టిగా అరిచి చెప్పింది రంగమ్మ.

ఎక్కడో కొట్టు మిట్టాడుతున్న ప్రాణం లేచొచ్చినట్లు బోసినోటిని తెరిచింది ముసలమ్మ. మెత్తగా చేసిన అరిసెను ఆమె నోట్లో పెట్టింది రంగమ్మ. నెమ్మదిగా చప్పరించింది. నీరు తాగిస్తుండగా 'కొడుకా!' అంటూ ఒక్క మూలుగు మూలిగి కోడలి భుజంపై తలవాల్చింది ముసలమ్మ. ★

ఎగ్జామినేషన్ ఫోబియా

"ఏమోయ్ రవీ! పరీక్షలకు బాగా ప్రిపేరయ్యావా?"

"అయ్యాను సార్!"

"అయ్యాను సార్ అని అంత నీరసంగా మొఖం పెడ్తున్నావేవిటి?"

"నీరసంగా మొఖంపెట్టక ఏం చెయ్యమంటారు?"

"ఏమైంది రవీ! అసలు విషయం చెప్పు?"

"ఎంత చదివినా యేదీ గుర్తుండటం లేదుసార్. పరీక్ష హాల్లోకి వెళ్ళాలంటేనే వణుకు పుడ్తోంది"

"నువ్వు చదువులో చాలా తెలివైనవాడివే గదా ఎందుకలా జరుగుతోంది"

"అదే అర్థంకావడంలేదు సార్... మామూలుగా చదువుకుంటోంటే బాగానే ఉంటుంది. కానీ పరీక్షలకోసం చదవడం అనగానే యేదో అర్థంకాని భయం వేధిస్తున్నది. పుస్తకం వెంటనే మూసేసి ఎక్కడికైనా పారిపోవాలనిపిస్తుంది. అలా అని పారిపోనూలేను. చదవాలనే తపన వేటాడుతూనే ఉంటుంది. కానీ చదవలేను. చదవకుండా ఉండనూ లేను. ఎటూగాని పరిస్థితి. చదవకపోతే రేపు పరీక్షలో యేం రాస్తాను. ఎలా ప్యాసవుతాను అని మథనపడటం ప్యాసుకాకపోతే అమ్మానాన్నలు ఎంత బాధపడ్తారో... ఎంతటి అవమానాలకు గురవుతారో అని ఊహించుకోవడం. మా అమ్మానాన్నలకు చాలామంది ఫ్రెండ్సే వున్నారు. వాళ్ళెప్పుడు వాళ్ళ పిల్లల్ని గూర్చే చెప్పుకుంటారు. మా అమ్మాయికి ఫస్ట్ ర్యాంక్ వచ్చిందనీ, మా అబ్బాయి కాలేజి ఫస్టొచ్చాడనీ... అలాంటి వాళ్ళ మధ్య ఉంటున్న మా అమ్మానాన్నలు మావాడు ఎగ్జామ్ ఫెయిలయ్యాడని చెప్పుకుంటే ఎంత అవమానం చెప్పండి. పుస్తకాల మీద మనసు నిలపలేను. వెధవ ఎగ్జామ్ పోతే పోయిందిలే అని మొండికేయనూలేను. ఈ సంఘర్షణ కొన్నిసార్లు చాలా దుర్భరంగా... భయంకరంగా మారిపోతున్నది. ఈ బాధ కంటె యే ఎండ్రినో, ఎలకలమందో తాగి చస్తే పీడా వదిలిపోతుందిగదా అని ఆలోచిస్తున్నాను."

"నీ ధోరణి చూస్తోంటే నువ్వు చాలా తీవ్రమైన ఎగ్జామినేషన్ ఫోబియాతో బాధపడ్తున్నట్లు అర్థమౌతోంది. మామూలు టైమ్‌లో మామూలుగానే ప్రవర్తించే కొందరు నీలాంటి విద్యార్థులు పరీక్ష అనగానే ఇలా మారిపోతుంటారు. విపరీతంగా ప్రవర్తిస్తుంటారు. కడుపులో వణుకు పుడ్తుంది. చెమటలు కార్తాయి. పుస్తకం తెరచి చదువుతున్నట్టే కనిపిస్తారు గానీ ఒక్క అక్షరం కూడా చదవలేరు. చదివినా అది అర్థంకాదు. యేం చదివావో రాయమంటే ఒక్క అక్షరం కూడా రాయలేరు."

"మామూలుగా చదివినప్పుడు సులభంగానే అర్థమౌతుంది. కానీ ఎగ్జామ్ అనగానే పరిస్థితి మారిపోతుంటుంది. ఎందుకలా జరుగుతుంది సార్!"

"మనల్నెవరో పరీక్షించబోతున్నారు. అనే భావన మనలోని ఆత్మవిశ్వాసాన్ని దిగజార్చివేస్తుంది. మనల్ని వాళ్ళెవరో పరీక్షించినప్పుడు మనలోని లోపాలన్నీ వాళ్ళకు తెలిసిపోతాయేమొ... మనం నిజంగా యేమిటో వాళ్ళకు తెలిసిపోతుందేమొ... మన అజ్ఞానాన్ని చూసి వాళ్ళు నవ్వుతారేమొ... ఇలా ఊహించుకోవడంతో మనలో భయం ప్రారంభమౌతుంది. ప్రతివాడిలోనూ ఎంతో కొంత ఆత్మన్యూనతా భావం అంటే మనల్నిమనం తక్కువ చేసుకునే భావం ఉంటుంది. మనల్నెవరో పరీక్షించబోతున్నారని తెలిసినప్పుడు మనలోని ఈ ఆత్మన్యూనతాభావం ఇంకా ఎక్కువౌతుంది. మన అజ్ఞానమంతా బయటపడిపోతుందేమోనన్న భయం మనల్ని కృంగ దీస్తుంది. అసలు ఉన్నదానికంటె ఊహించుకోవడంవల్ల ఈ ఆత్మన్యూనతాభావం ఎన్నోరెట్లు ఎక్కువై పోతుంది. నా దృష్టిలో మనం దిగజారిపోవడమనేది చాలా ప్రమాదకరమైన మనస్తత్వం. మనమెప్పుడూ మనల్నిమనం తక్కువ చేసుకోకూడదు."



"దీనికి పరిష్కారమార్గమేమిటంటారు"

"మనలోని ఆత్మవిశ్వాసాన్ని బలోపేతం చేసుకోవడమే దీనికి పరిష్కారం. ఎవరో మనల్ని పరీక్షచేస్తే చెయ్యనీయ్. మనకొచ్చింది చెబుదాం. రాకపోతే రాదని చెబుదాం. అంతమాత్రాన మన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నట్టేమీ కాదు. ఈ ప్రపంచంలో అందరూ పరిపూర్ణ జ్ఞానులే లేరు. ఎంతో తెలుసుననుకునే వాళ్ళక్కూడా యేమీ తెలియని పరిస్థితి ఎదురవుతుంటుంది. పూర్వం సోక్రటీసు అనే తత్వవేత్త యేమన్నాడో తెలుసా? "నేను తెలుసుకున్నదేమిటంటే... నాకేమీ తెలీదని" అన్నాడాయన. జ్ఞానాన్నంతా మథించిన ఆ గొప్ప మేధావే అలా అన్నాడంటే ఈ జ్ఞానం అనేది ఓ మహాసముద్రంలాంటిదని, దాన్నెవ్వరూ స్వాధీనం చేసుకోలేరని అర్థం చేసుకోవాలి. మనల్ని పరీక్షించేవాడు మనకంటె గొప్పవాడేం కాదు. అతడికుండే పరిమితులు అతనికుంటాయి. మన అజ్ఞానం బయటపడ్తుందని ఊహించుకోవడం తప్పు. ఊహించుకోవడంలోనే చాలా దుఃఖం ఉంటుంది. ఊహించుకోవడాన్ని తగ్గించుకున్నప్పుడే మనమేదన్నా నిర్మాణాత్మకమైన పనిని చెయ్యగల్గుతాం. మరో విషయమేమిటంటే చదువొక్కటే ఓ వ్యక్తి జీవితానికి గీటురాయి కాదు. చదువొస్తే వస్తుంది. రాకపోయినా ఫరవాలేదు. ఈ ప్రపంచంలో అందరూ ఉన్నత చదువులు చదివిన వాళ్ళే లేరు. యేమీ చదువుకోనివాళ్ళు కూడా వాళ్ళ జీవితాల్లో మహత్తర విజయాల్ని సాధించిన దాఖలాలు ఉన్నాయి. కాబట్టి మన అజ్ఞానం బయటపడటంవల్ల యేదో పెద్ద అనర్థం జరుగుతుందని ఊహించుకోవడం అనవసరం. చదువుకోకపోతే మనం మరో రంగంలో రాణించవచ్చు. కాబట్టి మనల్ని మనం ఎప్పుడు తక్కువ చేసుకోవద్దు. మనలో ఉన్న బలమైన అంశాలేమిటో గుర్తించి వాటి ద్వారా యేదన్నా సాధించటానికి ప్రయత్నించాలి. ఇట్లా ఆలోచించగల్గితే మనలో ఆత్మవిశ్వాసం పెరుతుంది. అప్పుడు నీలో ఏర్పడిన ఈ ఎగ్జామినేషన్ ఫోబియా పోతుంది". ☆

అంపశయ్య నవీన్

పుష్పాల కృష్ణమూర్తి



ఒక కొంగ తుమ్మచెట్టు కొమ్మలో గూడు కట్టుకుంది. అందులో గుడ్లు పెట్టి, పొదిగి పిల్లను చేసింది. అది పెరిగి పెద్దదై క్రమేపీ రెక్కలకు ఈకలు మొలిచాయి. గాల్లోకి ఎగిరే శక్తి వచ్చింది.

అది ఒకనాడు, "అమ్మా! ఎవరూ కనిపించని ఈ అడవిలో ముళ్ల చెట్టు మీద గూడు కట్టావు ఎందుకు? ఎంచక్కా ఊళ్లో ఏదో ఒక చెట్టు మీద కట్టొచ్చుగదా" అని తల్లిని ప్రశ్నించింది.

"ప్రమాదం నాన్నా! మనుషులు మాంసాహారులు. నన్ను, నిన్ను కూడా పట్టుకొని చంపి, తినేస్తారు" అంది తల్లి కొంగ.

"అసలు ఇల్లెందుకు కట్టుకుంటారు? ఎక్కడో ఒక చోట వుంటే సరిపోతుందిగదా" అంది పిల్ల కొంగ.

"మనం ఎండకు-వానకు రక్షణ పొందడానికి, రాత్రివేళ నిద్రపోవడానికి ఇల్లు అవసరం. అంతేకాదు. ఇల్లు శత్రువుల బారి నుండి కూడా కాపాడుతుంది" అంది.

"అలాగా! అయితే ఎవరెవరికి ఎలాంటి ఇళ్లు వుంటాయో చూపించవా?" గారాంగా అడిగింది పిల్ల.

"సరే పద" అని ఆకాశంలోకి లేచింది తల్లి.

ఒక గిరిజనుడు తన ఇంటిని వెదురుకర్రలతో చెట్టుకొమ్మల మధ్య కట్టుకున్నాడు. దాన్ని చూపించి "ఈ అడవిలో క్రూరమృగాలున్నాయి కదా. అవి చెట్లు ఎక్కలేవు. చిరుతపులి, ఎలుగుబంటి వంటివి ఎక్కినా ఇంటికి తలుపు వుంటుంది కాబట్టి అతను సురక్షితంగా వుంటాడు. దీనిని తనే స్వయంగా నిర్మించుకున్నాడు" అని చెప్పింది.

"ఓహో! అలాగా..." అంది పిల్ల. తర్వాత ఆ రెండూ పక్కనున్న పట్టణానికి వెళ్లాయి.

"డబ్బు వున్న వాళ్లు భవంతుల్లో, పేదవాళ్లు ఈ గుడిసెల్లో నివసిస్తుంటారు. గుడిసెలో కంటే భవంతే ఎక్కువ రక్షణనిస్తుంది" అంది తల్లి.

తార్వత పెద్ద భవనంవైపు చూస్తూ "అలాగా. మరి అదేంటి?" అడిగింది పిల్ల కొంగ.

"అది రాజమహల్. అందులో రాజు వుంటాడు. ఆయన ఈ రాజ్య ప్రజలను పరిపాలిస్తుంటాడు" చెప్పింది.

"అంత పెద్ద భవంతిని ఆయనే కట్టుకున్నాడా?" ప్రశ్నించింది పిల్ల.

"లేదమ్మా! కష్టజీవులు చెమటోడ్చి కట్టారు దాన్ని" అంది తల్లి.

తర్వాత పశువులు వుండే పాక, మేకల దొడ్డి, చిలుక నివసించే చెట్టుతొర్ర అన్నీ చూపించింది. తర్వాత రెండూ వెనక్కు మళ్లాయి.

"ఆహా! ఆ చెట్టుకు వేలాడుతోందే ... అదేంటి? భలే తమాషాగా వుంది" అడిగింది పిల్ల.

"అది గిజిగాడి పక్షి ఇల్లు. అందులో అది తన కుటుంబంతో సురక్షితంగా వుంటుంది. చెట్టు కొమ్మ చివర్లో, బావి మీద వేలాడుతూ వుంటుంది కనుక శత్రుభయం లేదు" అంది.

తర్వాత పొలాల్లో బొరియలు చేసుకుని నివసించే ఎండ్రకాయల్ని, కలుగులు చేసుకొని జీవించే ఎలుకల్ని చూపించింది. "వీటికి ఆహారం ఎక్కడ దొరుకుతుందో ఆ పక్కనే నివాసాలు ఏర్పాటు చేసుకుంటాయి. శత్రువులు వెంటపడితే దొరక్కుండా కలుగులోకి దూరతాయి" అని చెప్పింది.

అలా వెళ్తుండగా గుహ ముందు ఓ సింహం కనిపించింది. "అబ్బో! సింహానిది ఎంత పెద్ద ఇల్లో" అంది ఆశ్చర్యంగా పిల్ల కొంగ.

"సింహాలు, పులులు, ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన నివాసాల్లోనే వుంటుంటాయి. వాటికి ఇల్లు ఎలా కట్టుకోవాలో తెలియదు" అని చెప్పింది తల్లి.

ఆ రెండూ అలసిపోయి ఓ చెట్టు మీద వాలాయి. దాని కింద ఓ పుట్ట వుంది. ఓ పాము అందులోకి వెళ్తోంది. "భలే వుందే ఈ పాము ఇల్లు. ఎంతకాలం కష్టపడి కట్టుకుందో" అంది పిల్ల.

"అది కట్టుకోదమ్మా. చీమలు తాము నివసించడానికి పుట్టలు నిర్మించుకుంటాయి. ఈ పాములు వాటిని ఆక్రమించుకుని వుంటుంటాయి" అంది తల్లి.

"ఈ ఇళ్లన్నీ చూశాక నాకు అర్థమైందేమిటంటే... క్రూర జంతువులు, పెద్ద జంతువులు ఏవీ కష్టపడి ఇల్లు కట్టుకోవు. చిన్నప్రాణులు శ్రమపడి ఏర్పాటు చేసుకున్న ఇళ్లను ఆక్రమించి, తమ స్వంత గృహాలుగా చెలామణీ చేసుకుంటుంటాయి. అవునా అమ్మా!" అంది పిల్ల కొంగ. తల్లి ఔనన్నట్లు తల ఊపింది.





వి'చిత్రం'

హాయ్! ఈ వారం వి'చిత్రం'లో మీ ముందుకు వచ్చిన బొమ్మ నిజంగానే విచిత్రమైనది. కావాలంటే... ముందు ఫొటోను జాగ్రత్తగా పరిశీలించండి. ఆ... చూసేశారా! అయితే మీకు ఏం కనిపిస్తోందో చెప్పండి. ఏంటీ...? రెండు భవనాల మధ్య కొంతమంది ముసుగు మనుషులు వున్నారా? బానేవుంది మీ ఊహ. మరి ఆ ముసుగు మనుషులు ఎంతమందో చెప్పకోండి చూద్దాం.

ఆ పని తర్వాత చేద్దురుకానీ... మీకో విషయం చెప్పాలర్రా! ఆ బొమ్మను సృష్టించిన అంకుల్ ఆలోచన వేరు. ఎలాగంటే... ఆ మనుషులను జలపాతంలాగా వేశారు. కావాలంటే రెండు చేతులతో పుస్తకం పట్టుకుని దూరంగా పెట్టి చూడండి. దూరంగా రెండు కొండల మధ్య నుంచి ఒక అందమైన జలపాతం పారుతున్నట్టుగా అనిపిస్తోందికదూ. మరదే ఆర్టిస్టు గొప్పతనం.

అన్నట్టు చిన్నారులూ... మీరేం చేయాలంటే... ఈ పుస్తకాన్ని మీ నేస్తాలకు కూడా చూపించి ఇవే ప్రశ్నలు వెయ్యండి. వాళ్లు చెప్పగలరేమో చూడండి. చెప్పలేకపోతే మీరు చెప్పేసి పెద్ద ఫోజు కొట్టండి. ఓకేనా!

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

నేస్తాలూ! ఈ వారం మీ ముందుకు వచ్చిన నటుడు ఎవరో గుర్తు పట్టారా? రుద్రవీణ సినిమాలో చిరంజీవి తండ్రిగా, భామనే సత్యభామనే చిత్రంలో ఫైటింగులు చేసే బామ్మను ఇష్టపడే తాతయ్యగా కూడా చేశారు. గుర్తొచ్చారా! అన్నట్టు ఈయనకు పద్మశ్రీ అవార్డు కూడా వచ్చిందర్రా. అయితే వెంటనే కార్డుమీద రాసి మాకు పంపితే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: **వీరివీరి గుమ్మడిపండు వీరిపేరేమి?** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

సరైన సమాధానాలు రాసినవారు

ఎ.సాహిత్యలోహిత, 3వ తరగతి, జి.మల్లేశ్వరి, 9వ తరగతి, కన్నెగండ్ల. వి.మధుసూదనరావు, 10వ తరగతి, బుద్ధారం, ఖమ్మం. ప్రేం సాగర్, 4వ తరగతి, ప్రేమసాధన, 7వ తరగతి, అనకాపల్లి. పి.జయశ్రీ, 7వ తరగతి, చిలుకలూరిపేట, జె.వాణి, 5వ తరగతి, భగత్‌సింగ్ నగర్, వనపర్తి. ఎన్.సుజన్, గుంటూరు. డి.ప్రసన్న వంశీ, 5వతరగతి, అద్దంకి, ప్రకాశం. డి.దినేష్, దివాకర్, 9వతరగతి, గుడిబండ, అనంతపూర్. పి.నాగప్రశాంత్, 7వతరగతి, మదనపల్లి, చిత్తూరు. కాలువ శ్రీతన్మయ, గుంటూరు. ఎస్.శరత్‌చంద్ర, 8వతరగతి, శ్రీకాకుళం. పి.వి.సాగర్, 9వ తరగతి, ఎమ్. వినయకుమారి, 7వ తరగతి, కోడూరు, గుంటూరు. బి.బబిత, 5 వతరగతి, బి.ఫాల్గున్, 10వ తరగతి, ఎమ్. మనోహర్, 6వ తరగతి, కె.టింకు, 3వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మెదక్. డి.సత్యసాయి, 10వ తరగతి, గవర్నమెంట్ హైస్కూల్, చీరాల.

గతవారపు జవాబు: **గాంధీజీ**

బాలనేస్తాలు

బయటకు రావడం ఎలాగబ్బా!

చిన్నారులూ... కింద ఒక ఇల్లు వుందికదా. మీరు ఆ ఇంటి పైనుంచి బయలుదేరి గుమ్మం నుంచి బయటకు రావాలి. ఆ గజిబిజి దారులు దాటుకుని రావాలంటే కొద్దిగా కష్టమే అనుకోండి. కానీ... మీలాంటి పిడుగులకు అదేం పెద్ద లెక్కలోనిది కాదనుకుంటున్నాం. మరి నిరూపించండి.



ఒకేరకం గుడ్లు ఏవి?



పిడుగులూ...! మీరు కోడిగుడ్లు తింటారా? ఇష్టమేనా? చాలానా? అమ్మో! అలా అయితే... మీకు ఒక పజిల్ ఇవ్వాల్సిందే. అదీ గుడ్లకు సంబంధించినదే ఇస్తాం. సరేనా.

పక్కన ఆరు రకాల గుడ్లు పన్నెండు వున్నాయి. కాకపోతే కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి. అసలు విషయం ఏంటంటే... ఏ రెండు గుడ్లు ఒకసైజువో మీరే కనిపెట్టాలి.

అలా కనిపెట్టే వరకు జవాబు మాత్రం చూడకూడదు. చూశారో మీతో పచ్చి కొట్టేస్తాం. జవాబుమీద ఒక చెయ్యి అడ్డం పెట్టుకుని మీరు మేం చెప్పిన పని చెయ్యాలి. గుర్తుపట్టడం అయిపోయాక జవాబు చూసి మీకు ఎన్ని మార్కులు వచ్చాయెా తెలుసుకోండి. పన్నెండుకు పన్నెండు మార్కులు వచ్చినవారు వెరీగుడ్డు అన్నమాట.

జవాబు



❄

ఆహా! పూాల గుత్తి



నేస్తాలూ... రావాలి. రావాలి. ఇవాళ మీలాంటి ఓ చిన్నారి పేపర్ పూల గుత్తి చెయ్యడం నేర్పుతానంటున్నాడు. మరి నేర్చేసుకుంటారా!

ఏమేం కావాలంటే... పల్చటి రంగురంగుల కాగితాలు, కత్తెర, గమ్.

ఎలా చెయ్యాలంటే... ముందు రంగు కాగితాలను దీర్ఘ చతురస్రాకారంలో కత్తిరించి పెట్టుకోవాలి.

తర్వాత ఒక కాగితం తీసుకుని గుండ్రంగా చుట్టండి. అది చుట్టడం పూర్తికావస్తోంది అనగానే మరో రంగు కాగితాన్ని అక్కడ వుంచి చుట్టెయ్యాలి. ఇలా మూడు నాలుగు రంగు కాగితాలను చుట్టాలి.

ఇప్పుడు రెండవ బొమ్మలోలాగా రోల్ సగం వరకు కత్తెరతో సన్నగా పీచుల్లాగా కత్తిరించాలి.



ఇంక రోల్ మధ్యలో రెండుమూడు పీచులను పట్టుకుని గిరగిరా తిప్పుతూ పైకి లాగాలి. అంతే... రెపరెపలాడే రంగురంగుల పేపర్ పూల గుత్తి మీ చేతిలో వుంటుంది. చివరిగా కింద మాత్రం కాగితాలు ఊడిపోకుండా గమ్‌తో అతికించాలి. అంతే.

తుర్రం రాజశేఖర్, 9వ తరగతి, ఎర్రంపేట స్కూల్, రేగులపాడు, ఖమ్మం.

❄

చిన్నారి చిత్రకారులు

జి.నవీన్ కుమార్, 4వ తరగతి, లిటిల్ ఏంజల్స్, టుంగుటూరు.



ఎం.నందిని, 8వ తరగతి, రాయమాధారం, ఏన్కూర్, ఖమ్మం.

అంధుని నృత్యం

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

వర్షం కురుస్తోంది. చలిగాలి వీస్తుండటంతో షాపులో తలుపు మూసివేసి ఓ మూలన కూర్చున్నాడు బసేగౌడ.

షాపులో కుర్రవాడు మాత్రం తెరిచిన తలుపులోంచి రోడ్డుపైన గొడుగులతో వెళ్లి వచ్చేవారిని చూస్తున్నాడు.

సాయంత్రం అయిదుగంటలు అయింది.

మెయిన్‌రోడ్డుకు కాస్త దగ్గరగా సందులో ఉన్న ఆ ట్రావెల్ ఏజన్సీ కార్యాలయం చాలామందికి తెలుసు. బెంగుళూరు బస్టాండు వద్ద ఉండటం వల్ల చాలామంది అక్కడికి వచ్చి ప్రైవేటు బస్సుల వివరాలు తెలుసుకుంటుంటారు.

షాపు చిన్నదే అయినప్పటికీ ఓ పక్క పబ్లిక్ టెలిఫోన్ బూత్, దాంట్లోనే చిన్న ఫ్యాన్సీ దుకాణం పొందికగా నిర్వహిస్తున్నారు. దాని యజమాని బసేగౌడ.

రెండేళ్ల క్రితం స్వయం ఉపాధి కోసం ఆ షాపును ప్రారంభించాడు. అన్ని విషయాలు చూసుకోవడానికి సహాయకునిగా ఉండటానికి సిద్దణ్ణ అనే కుర్రవాడిని పెట్టుకున్నాడు. షాపు బసేగౌడది అయినప్పటికీ దాదాపు కార్యభారం అంతా సిద్దణ్ణ చూస్తుంటాడు. ఆ ప్రాంతంలో చాలామందికి ఆ షాపు గురించి, దాని యజమాని గౌడ గురించి బాగా తెలుసు.

"వర్షం బాగా పడుతోందా?" అడిగాడు గౌడ.

"ఓ మాదిరిగా కురుస్తోంది. అయినా రోడ్లన్నీ తడిసిపోయాయి. మనుషుల రాకపోకలు కూడా తగ్గిపోయాయి!"

"అవసరం ఉన్నవారు ఎలాగూ వస్తారు. తిరుపతి బస్సుకు... హైదరాబాద్ బస్సుకు ఆరు టిక్కెట్లు మిగిలిపోయాయి. బస్సు ఓనరు ఇప్పుడే ఫోన్ చేశాడు. ఎవరైనా వస్తారో రారో తెలియదు..." గౌడ అన్నాడు.

"ఏడు గంటల వరకూ టైముంది కదండీ... చూద్దాం... బస్సు కోసం రాకపోయినా ఫోన్ కోసం అయినా ఎవరో ఒకరు వస్తారులెండి!" సిద్దణ్ణ అనునయించాడు.

బసేగౌడ ఏమీ మాట్లాడలేదు.

పక్కనున్న టేబుల్‌పై ఉన్న ఫైళ్లను తీసుకుని మూలన ఉన్న బీరువాలో పెట్టుకున్నాడు. సాధారణంగా రాత్రి పదిగంటల వరకూ ఆ షాపు ఉంటుంది. ఎప్పుడైనా పనిమీద ఏ ఊరైనా వెళితే మొత్తం వ్యవహారాలన్నీ సిద్దణ్ణే చూస్తుంటాడు. డబ్బుల విషయంలో నమ్మకంగా ఉండటం వల్ల మొత్తం వ్యవహారాలన్నీ అతనికే అప్పగిస్తుంటాడు గౌడ.

"సిద్దణ్ణా! ఎందుకైనా మంచిది కొవ్వొత్తి అగ్గిపెట్టె సిద్ధంగా ఉంచు. వర్షం పడినప్పుడు కరెంటు పోతుందేమో"! హెచ్చరించాడు.

సిద్దణ్ణ తన యజమాని వైపు చూశాడు. కళ్లు మూతలుపడి ఉన్నాయి. ఒక్కసారి అతని హృదయం మౌనం అయిపోయింది.

'కనులు లేవని నీవు కలత పడవద్దు...' అని బసేగౌడను ఊరడించేవారు ఎవరూ లేరు.

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆనంద్‌నుంచి బహుమతి ప్రధానం

అయినప్పటికీ ఆత్మవిశ్వాసంతో విజయాలు సాధించడం అతనికి ఎంతో నచ్చుతుంది. అందుకే బసేగౌడ అంటే ఎంతో అభిమానం. ఆ అభిమానంతో షాపులో సహాయకుడిగా ఉన్నప్పటికీ దానిని తన షాపుగానే భావిస్తుంటాడు.

సిద్దణ్ణ ఆలోచనల్లో ఉండగానే షాపు ముందు కారు ఆగింది. అందులో వారు తమ షాపులోనికే వస్తారని సిద్దణ్ణ అంచనా వేసి లేచి నిలబడ్డాడు.

డోరు తీసుకుని ముగ్గురు స్త్రీలు, డ్రైవర్ సీటులో నుంచి మరో వ్యక్తి కిందకు దిగారు. వర్షం కురుస్తుండటంతో గబగబా షాపులోకి వచ్చేశారు.

సిద్దణ్ణ వారిని ఆహ్వానించి కుర్చీల్లో కూర్చోబెట్టాడు.

ఫోన్ గురించో, ట్రావెల్ బస్సుల గురించో ఎంక్వయిరీ చేయడానికీ వచ్చారని అతను భావించాడు. "ఏం కావాలి?" వీలైనంత వినయంగా అడిగాడు.

అతని ప్రశ్నకు జవాబు చెప్పకుండా "బసేగౌడ అనే డాన్సర్ ఈ షాపు నడుపుతున్నట్లు మాకు అడ్రసు ఇచ్చారు. అందుకే వెతుక్కుని వచ్చాం. ఆయన ఉన్నారా?" లావుగా హుందాగా ఉన్న స్త్రీ అడిగింది.

వారి మాటలు విన్న బసేగౌడ పరధ్యానం నుంచి బైట పడ్డాడు. "నమస్కారం... నేనే బసేగౌడను... ఎవరు మీరు" అంటూ లేచి తడుముకుంటూ వచ్చి వారికి సమీపంలో ఉన్న కుర్చీపై కూర్చున్నాడు.

వారు ప్రతి నమస్కారం చేశారు.

"మీరు మంచి డాన్సర్ అని విన్నాం... మా సంస్థ తరుపున మీ ప్రదర్శన ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. మా సభ్యులు కొంత డొనేషన్ సేకరించారు. మీ ప్రదర్శన ద్వారా వచ్చిన డబ్బులు కలుపుకుని సునామీ బాధితులకు విరాళంగా ఇద్దామనుకుంటున్నాం..." మరో స్త్రీ వివరంగా చెప్పింది.

"సినిమా వాళ్లనో మరెవరినో తీసుకువస్తే బాగుండేదేమో"

మాకు ఆ ఆలోచన లేదు. మేం నిర్వహించే ఈ ప్రదర్శన ద్వారా మీకూ, మీతో బాటు సునామీ బాధితులకు తోడ్పడాలన్న ఆలోచనతో ఈ నిర్ణయానికి వచ్చాం. మీరు కాదనకూడదు..." వారు అభ్యర్థించారు.

"అలాగే కానివ్వండి!" బసేగౌడ ఆమోదం తెలిపారు.

✿ ✿ ✿

కర్ణాటక రాష్ట్రంలో బెంగుళూర్ సమీపంలో బసేగౌడది చిన్న పల్లెటూరు. తల్లిదండ్రులకున్న ముగ్గురు సంతానంలో చిన్నవాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోవడం, పెద్దవాళ్లు ఇద్దరూ చెట్టుకొకరు పుట్టకొకరు చెదిరిపోవడంతో ఒక్కడే మిగిలాడు.

ఆరేళ్ల వయసులో కంటి చూపును కోల్పోయాడు. జీవితం అంతా అంధకారం అయిపోయింది. చిన్నవయసులోనే మనసును స్థిమితం చేసుకున్నాడు.

తను ఉంటున్న పల్లెటూరు నుంచి బెంగుళూరు చేరుకున్నాడు. మొదట ఎవరూ లేని అనాథగా జీవితంపై విరక్తిని పెంచుకున్నాడు. కళ్లు లేకపోవడం వల్ల అంధకారం మాత్రం తెలిసేది. దానిని అధిగమించడానికి ప్రయత్నించాలని నిర్ణయించుకున్నాడు.

తెలిసినవారిని కనిపించినవారిని తన

గోడు వినిపించి తనను ఆదుకోవాలని వేడుకున్నాడు. బెంగుళూరులో ఉన్న 'రమణమహర్షి అకాడమీ ఫర్ బ్లైండ్' అనే సంస్థలో చేరాడు. అనాథలైన అంధుల్ని ఆదుకోవడంతో బాటు వారి జీవనోపాధికి ఆ సంస్థ ప్రణాళికలు వేస్తుంది.

వారు నేర్పించిన విషయాలను తెలుసుకోవడం. పెట్టింది తినడంతో జీవితం నిస్సారంగా గడిచేది. అయిదారు సంవత్సరాలు ఆ విధంగానే గడిచిపోయాయి. అయితే ఆ సమయంలో కలసిన అశోక్‌కుమార్ అనే నృత్యదర్శకుడు బసేగౌడ జీవితంలో పెద్ద మార్పును తీసుకువచ్చాడు.

అనాథశరణాలయానికి వచ్చి అతను ప్రదర్శించే నృత్యాలు అందరినీ ఆకట్టుకొనేవి. కొరియోగ్రాఫర్‌గా అశోక్ కుమార్‌కు మంచి పేరు ఉండటంతో బసేగౌడ అతని పట్ల విపరీతంగా ఆకర్షితుడయ్యాడు. తనకు కళ్లు లేనందువల్ల ఆ లోపాన్ని అధిగమించడానికి నృత్యం నేర్చుకోవాలని అనుకున్నాడు.

బసేగౌడ కోర్కెకు అనుగుణంగా అశోక్‌కుమార్ తనకు తెలిసిన జానపద నృత్యాలను నేర్పించాడు. అతను ఎలా చేస్తున్నాడో తెలియకపోయినా చెబుతున్న మాటలను వింటూ కాళ్లు కదుపుతూ జానపద నృత్యాలు చేసేవాడు.

బసేగౌడలో ఉన్న ఆసక్తికి అశోక్‌కుమార్ కూడా ఎంతో సంతోషపడేవాడు. అన్ని విషయాలు చెప్పేవాడు.

"నాకు భరతనాట్యం నేర్చుకోవాలని ఉంది!" బసేగౌడ ఒకరోజు జానపద నృత్యం పూర్తయిన తర్వాత అడిగాడు.

అశోక్‌కుమార్ ఆశ్చర్యపోయాడు. రెండు నిమిషాలు జవాబివ్వలేదు. "నీకా?" విస్మయం వ్యక్తం చేశాడు.

"అవును. నాకే... జానపద నృత్యం ఎవరైనా చేస్తారు. అందుకే వారికి భిన్నంగా భరతనాట్యం నేర్చుకోవాలని ఉంది!" అన్నాడు.

"సంగీతం శ్రవణానందకరం... నాట్యం నయనానందకరం. బదిరులు సరిగమలు నేర్చుకోవడం ఎంత కష్టమో... అంధులు నాట్యాన్ని అభ్యసించడం మరింత కష్టం!"

బసేగౌడ విడిచిపెట్టలేదు.

ఆశ్రమానికి విచ్చేసే అశోక్‌కుమార్‌ను పదేపదే అభ్యర్థించాడు. స్పర్శలు, సంజ్ఞల ద్వారా భరతనాట్యాన్ని నేర్చుకోగలనని ఒప్పించాడు. అతని పట్టుదల, దీక్షల ముందు అశోక్‌కుమార్ తలవంచక తప్పలేదు.

గౌడలో పట్టుదలను చూసి కొన్ని ప్రత్యేక పద్ధతుల ద్వారా భరతనాట్యాన్ని నేర్పించే శిక్షణ ప్రారంభించాడు. తదిగణతోం అంటూ అతను చెప్పే విన్యాసాలను అర్థం చేసుకుని నృత్యాన్ని నేర్చుకున్నాడు. బసేగౌడలో పట్టుదలను ఆదర్శంగా తీసుకుని ఆ ప్రాంతంలో కొంతమంది వికలాంగులు, అంధులు కూడా వారితో చేరారు. అటువంటి వారిలో ఆసక్తి అశోక్‌కుమార్‌లో మరింత ఆసక్తిని పెంచింది. వారందరినీ కలిపి ఒక బృందంగా ఏర్పాటు చేశాడు.

బెంగుళూరులో వివిధ ప్రాంతాల్లో నివశించే వీరందరినీ ఒక బృందంగా తయారుచేయడంతో 'అంధుల భరతనాట్యం' ఏర్పాటైంది. దానికి అశోక్‌కుమార్ నిర్వాహకునిగా మారాడు. తమకు నాట్యం నేర్పించిన నాట్యాచారునిగా అశోక్‌పట్ల అచంచల విశ్వాసం ఉండటంతో బృందం ప్రత్యేకంగా గుర్తింపు పొందింది.

దేశ విదేశాల్లో వీరి నృత్య ప్రదర్శనలు ఏర్పాటయ్యాయి.

ఏ ప్రాంతంలో ప్రదర్శన జరిగినా ఎంతోమంది తరలివచ్చి చూసేవారు. నృత్యంలో ప్రధానమైన హావభావాలు ముఖకవళికల్లో మార్పులను అంధులు చూపించలేరని అనేవారు. అయినప్పటికీ దానిని అధిగమించి ఎటువంటి లోపాలు లేకుండా ప్రదర్శించేవారు.

భరతనాట్యాన్ని నేర్చుకున్న తొలి అంధునిగా బసేగౌడకు ప్రత్యేక గుర్తింపు లభించింది. నాట్యబృందంలో ఎంతమంది అంధులు ఉన్నప్పటికీ వారందరూ గౌడ స్ఫూర్తితోనే ఈ రంగంలోకి వచ్చారని అందువల్ల ఈ ప్రక్రియకు ఆయనే ఆద్యుడని గుర్తింపు పొందాడు. ఎప్పుడు ఎక్కడ ప్రదర్శనలకు ఆహ్వానం లభించినా తన బృందంలో మిత్రులందరినీ ఆహ్వానించేవాడు. ఒకటి రెండు రోజులు ప్రాక్టీసు చేసి ప్రదర్శనలకు బయలుదేరేవారు.

ప్రదర్శనలు కూడు పెట్టవన్న విషయం బసేగౌడకు బాగా తెలుసు. అందువల్ల జీవనాధారం కోసం ట్రావెల్ ఏజెన్సీని నిర్వహిస్తున్నాడు. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులకు, బస్సుయజమానులకు మధ్యవర్తిగా బస్సు టిక్కెట్లు సమకూర్చిపెట్టడం అతని పని. దాంతోపాటు చిన్నషాపు, ఎస్.టి.డి పబ్లిక్‌టెలిఫోన్ బూత్ నిర్వహించడం వల్ల జీవనానికి ఒక మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నాడు.

బెంగుళూరు దూరదర్శన్‌లో బి.గ్రేడు కళాకారునిగా అవకాశం లభించడంతో అప్పుడప్పుడు అందులో కార్యక్రమాలకు హాజరయ్యేవాడు. ఇతను అంధత్వంతో నాట్యాన్ని అభ్యసించి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచినందుకుగాను 2000 సంవత్సరంలో జాతీయస్థాయిలో "అవుట్‌స్టాండింట్ అచీవ్‌మెంటు" పురస్కారం లభించింది.

అభినందనలు, పురస్కారాలు లభించినప్పటికీ తన పని తాను చేసుకుపోతూ సామాన్యంగానే జీవనాన్ని కొనసాగించేవాడు.

❁ ❁ ❁

ఆడిటోరియం ప్రేక్షకులతో క్రిక్కిరిసిపోయింది.

బసేగౌడ భరతనాట్య ప్రదర్శన మొదలైంది.

ఆరుగురు బృందంతో కలిసి బసేగౌడ వేదికపైకి వచ్చి సంగీతానికి అనుగుణంగా నృత్యం ప్రారంభించాడు. అతనితో పాటు మిగిలినవారు కూడా ఈ కార్యక్రమంలో అతనికి పోటీగా డాన్సు చేశారు. నిష్ణాతుడైన వ్యక్తి చేసిన మాదిరిగా విన్యాసం, మెడ విరుపులు, లయబద్ధమైన పాదాల కదలికలను చూసి వీక్షకులు పులకించిపోయారు.

అవార్డు ప్రధానోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన అది. రెండుగంటలపాటు ఏకధాటిగా సాగింది.

తర్వాత కార్యక్రమం మొదలైంది.

ఎంతోమంది ప్రముఖులు, వివిధ రంగాల్లో నిష్ణాతులు అయినవారు హాజరయ్యారు. 'కేవిన్‌కేర్ ఎబిలిటీ ఫౌండేషన్' సంస్థ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ప్రతి ఏడాది ఏదో రంగంలో విశేషకృషి చేసినవారికి పురస్కారాన్ని అందిస్తుంటారు.

మాజీ సెంట్రల్ విజిలెన్సు కమీషనర్ బి.పి. విఠల్, మహిళా కమీషన్ చైర్‌పర్సన్ మోహినిగిరి, సినీ దర్శకుడు మణిరత్నంలతో కూడిన బృందం బసేగౌడను ఉత్తమ వ్యక్తిగా ఎంపిక చేసింది. ఆ కార్యక్రమంలో బహుమతి పొందిన వ్యక్తి ప్రతిభను అందరికీ చూపించి ఇతడిని ఈ ఏడాది ఎంపిక చేశామని బహుమతి ప్రదానం చేశారు.

కార్యక్రమం మొదలైంది.

వక్తలందరూ మాట్లాడిన తర్వాత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ బసేగౌడకు అవార్డు ప్రధానం చేశారు. నిర్వాహకుని సహాయంపై ప్రేక్షకుల మధ్య నుంచి వెళ్లి వేదిక ఎక్కి బసేగౌడ అవార్డును అందుకున్నాడు.

ఆడిటోరియంలో కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

అంతకు అరగంట ముందు వేదికపై భరత నాట్యం చేసిన వ్యక్తి, ఇతనూ ఒకరే అంటే చాలామందికి నమ్మకం కలగడం లేదు. చాలామంది కళ్లల్లో విస్మయం తొంగిచూస్తోంది.

నిర్వాహకులు మాట్లాడమని కోరారు.

కానీ బసేగౌడకు మాట్లాడటానికి మనస్కరించలేదు.

అయినప్పటికీ ఆర్గనైజర్ వైరలెస్ మౌత్ పీసును బసేగౌడ చేతిలో పెట్టాడు.

కొద్ది క్షణాలు మాటలు రాలేదు.

తర్వాత నెమ్మదిగా పెదవులు విప్పాడు.

"నేను ఆటగాడినే కాని మాటగాడిని కాను. మీరందరూ నేనేం చెబుతానా అని నా వైపు చూస్తున్నారు. కానీ నేను మిమ్మల్ని చూడలేను. మీ కళ్లల్లో ఆసక్తిని చూడలేను. అయినా మీ అభిమానాన్ని గత కొంతకాలంగా పొందుతున్నవాడిని. చూపులేని వారు ఏదో పని చేయవచ్చు. భరతనాట్యం ఎందుకు చేస్తున్నారని అనుకోవచ్చు. నృత్యంపై నాకు ఆసక్తి కలిగిన తర్వాత దానిని ప్రేమించడం మొదలుపెట్టాను. తర్వాత అదే నా ప్రాణం అయిపోయింది. నా కంటూ ఈ లోకంలో ఎవరూలేరు. నా తోడూ నీడా నా భరత నాట్యమే..." చెప్పడం ఆపాడు. బసేగౌడ. అతని గొంతులో మార్పు వచ్చింది. హృదయం లోంచి దుఃఖం తన్నుకువస్తున్న గుర్తుగా కళ్లల్లో తడి.

తర్వాత మళ్లీ మైకును నోటివద్ద పెట్టుకున్నాడు. "నాలో భరతనాట్యం అనే కళ ఉన్నందున నాలో వైకల్యం మీకెవరికీ గుర్తురాలేదు. ఏ కళలోనూ ప్రావీణ్యం పొందలేకపోయినా అంధుల్ని మాత్రం ఆదరించండి. మీరందరూ అలా చేయడమే నాకు మీరు అందించే నిజమైన సత్కారం..." అంటూ కిందకు దిగిపోయాడు!

బసేగౌడ వేదిక మెట్లు దిగి కింద కుర్చీలోకి వచ్చి కూర్చునేంతవరకూ ప్రేక్షకుల నుంచి చప్పట్లు మారుమోగుతూనే ఉన్నాయి. ☆

మాలచ్మీ కాదు... ధనలచ్మీయే

ఏటలగా కవ్వనాగ నోరెల్లబెట్టీసినారు...

నానేటనన్నానేని అలగయిపోయినారు. మరి నేనేటి అబద్దవాడనేదు.

ఉన్నవూటనే అన్ననంతే నమ్మకున్నరేటిలగ.

మీరెన్నన్నా అనుకొండి గానీ నానొక్కమాటంతాను. చెవినెట్టండి మరి.

ఈ తవిటమ్మ...అంటే నానే... ఎవ్వటికి నిక్కచ్చే మాటాడద్ది... అంతే...మరేటినేదు.

నానేటన్నాను. మాలచ్మి కాదు...దనలచ్మీయే అన్నాను. కాదేటి మరి...

మన ఎనకటోల్లు...

మల్లదిగో...నాను ఎనకటోల్లు అనీసినానని... ఎవలానీసి ఇంటెనకీది వొంక సూసేస్తన్నరు ఏటిలగ?

మన పెద్దోల్లనీ మాటొరనకి ఎనకటోల్లె అనేస్తుంకాదేటి...అలగనేసీనాననమాట.

ఎవరింటోనన్నా మొగ గుంటడు పుట్టేసినాడనుకో... మన ఎనకటోల్లు ఏటంతరూ...

వంశోద్దారకుడు పుట్టీసినాడని మా సంతోషంగా అనేస్తరుకాదేటి...

వంశాన్ని ఉద్దరిచ్చేత్తాడో... మరేటి సేస్తాడో అది తరవాత సంగతి కదా...

ఇప్పటేలకి అలగనేస్తరు... మొగ్గుంటడనగానే వంశోద్దారకుడనే.

మరి ఆడగుంటనేటంతరు...

ఆ...ఆడదాయి పుట్టిందా...అనేసి నోరు తెరిసేసేసీ అలాగే వుంచేత్తారు కాదేటి...

ఆడపిల్లనంగానే అలగనిపించే స్తదో ఏటోమరి!

కానీ కొందరు మంచి మొగోల్లుంతరు మా ఆయన సివమ్మాచెలంలాగా. మా వక్కింటి అప్పల్నాయుడునాగా తాగుబోతెదవ కాదు.

మా సివమ్మాచెలంలాగా మంచివెుగోల్ల మూలంగానో...ఆడోల్లకు ఆడోల్లే తోడు కధా...అలాంటోరు వల్లో గానీ...ఆడపిల్లనంగానే



మాలచ్మీ అని కూడా అనుకుంతన్నరు. అనుకువి సంతోసిత్తారు కూడా.

ఆడపిల్ల ఇంటికి మాలచ్మిరా అనికూడా ఎనకటోల్లే అన్నారుకదా...అందుకనీ ఆ మాటకూడా ఎనకటికాలంనుంచే వచ్చిన మాటమరి!

ఇప్పటికాలం బట్టీ ఆడపిల్లంటే గుండెలమీన కుంపటనేసీ, కట్నాలనీసి, పురుళ్ళూ పెట్టుబళ్లూ అనీసి ఆడపిల్లంటే అరిష్టమనీవోళ్ళూ ఉన్నారు.

త్రినేత్రి

అలగనుకునే కొందరు కడుపులో ఆడగుంటని కడుపులోనే డాకటేర్లకాడి మిసన్లతోటి చిదిపేత్తన్నరంట.

మల్లిప్పుడేమో...ఒక్క ఆడపిల్లను కంటే లచ్చరూపాయలు ఆ పిల్లకోసమి...ఇప్పుడే బ్యాంకులో ఎట్టేత్తం అని గవుర్మెంటోళ్ళు ఓ అనేస్తన్నారు.

ఒకేల... ఒక్క మగ్గుంటడన్నా ఉంటే బాగుణ్ణని మళ్ళీ ఏడాదికి చూస్తే... అవ్వుడూ మళ్ళీ ఆడదాయేననుకోండి...

ఇద్దరాడపిల్లలున్నా...ఆల్లకోసం కూడా డబ్బు ఇస్తామనే అంటున్నారు మన ఏలిన మారాజులు.

మన ఏలిన మారాజులు ఒకోసారి ఆడోల్లందరినీ ఓ పొగిడేసే ఓట్టేపిచ్చుకుంతరు. మల్లా ఆల్లే ఆడోల్లకు నెత్తిన చెంగేత్తరు. అచ్చీ మేమలగన్లేదుమీ...అని బొంకేత్తరు. ఇప్పుడు మల్లా ఆల్లే ఆడపిల్లకు లచ్చరూపాయలు ఇత్తమంతన్నరు.

మరందుకే...

ఆడపిల్లంటే మాలచ్మియేం కాదుమీ...దనలచ్మి అంతన్నాను. కాదేటి మరి.

కానయితే ఈ ఇనయం...మా ఇంటి వక్క తాగుబోతెదవకి ఇంకా బాగా తెలిసిపోనాది.

ఆడికి తాగటాకి డబ్బుల్లేనప్పుడల్లా అప్పుడుగుతాడా...ఆ సారాకొట్టోళ్ళు ఎట్టా తీరుత్తావురా ఎదెవన్నరెదవా అంటారు...అప్పుడాడు... సిమ్మాచెలం కొండమీది అప్పలకొండమీదొట్టురా...నా ఆడదాయికి ఆడగుంట పుట్టింది కాదేటి...అది పెరిగిపెద్దయితే నచ్చరూపాయిల్రావేటి...అయి తీర్చేత్తాను గానీ సారా అప్పుపొయ్యిమీ అనంటున్నాడంట.

★

'పాద యాత్రలు'

"ఏం దే రాజమల్లన్న...! నీ పేరే నువ్వద్ది... నువ్వు అర్‌గిజ్‌కు అవద్దమాడవు... గిసొంటి నువ్వు పాదయాత్ర లంటె పెదవిరిసినట్టు ప్రవర్తించబడితివి... గీ పాదయాత్రలతోని ఎన్నెన్ని లాభాలున్నయని... గివ్వటితోనే కద మన ముఖ్యమంత్రి మందిల కలిసిపెయిండు... వాళ్ళతోని తిన్నడు... వాళ్ళతోని కలిగలిసి పెయిండు... గాల్ల సమస్యలన్ని తెల్సుకున్నడు... గందుకోసమే గెల్సిండని చెప్పగని, గయినె గెల్సుటానికిదో కారణం... వెనుకట రాజులు గూడ పాదయాత్రల నెట్లుపయోగించుకున్నరు? గిసొంటి ఫాట్ని నువ్వు గివ్వేందన్నట్టు సూడవడ్తివి..."

"శంకర్... నువ్వు నన్ను సరిగ్గా అరుతం జేసుకోలేదు... నేను పాదయాత్రలు మంచివిగాదని ఎప్పుడన్ననో సెప్పు... పాదయాత్రలు మా జోరుదారుయి. అయితె పాదయాత్రలుగాని ఏమన్నగాని ప్రజలకుపయోగపడేటియైతె మంచిది. ప్రచారం కోసమే అయితే దండుగే... గీ సంగతి అందరికెరుకయింది గద... పనులు జేసేదిమొ లేదు. విపరీతంగ ప్రచారం జేసుకుంటేమైతదో అనుభవంల కచ్చింది గద. కని కొందరికి గదేపిచ్చి... ఎప్పటికి వార్తల్ల కనపడాలె... మంచిది చెడ్డదన్న ముచ్చట్లేదు. అధికారులుంటె ప్రతిపక్షపోల్లను, ప్రతిపక్షంలుంటె అధికారంలున్నోల్లను తిట్టాలె... గీనె గెల్సిండు గెల్సిండంటవు... గెలువకుంటేం జేత్తడో సెప్పు...! గీనె బస్సులల్ల పాయె... కాలినడకన పాయె... ప్రజలందరితోని కలగలిసిపాయె... గయినె మీది మోటర్ల మంచి దిగె... సూటుబూటులుండె... గీనేమొ ప్రజలను బుదురకించుకుంట చెప్పుతె, గయినేమొ బెదిరించుకుంట చెప్పె... సరే... ఓట్లల్ల గెల్సుడు ఓడిపోవుడు మామూలేకాని నాయకుడన్నోడు ప్రజలల్ల కల్సిపోవాలి. అండ్లొక్కడై పోవాలె... మరి ప్రజలల్ల కల్సిపోయే పరిస్థితులు లీడర్లకున్నయా అంటవేమొ...! సమాజంల ఆ పరిస్థితులుండెటట్టు చూసుకోవాలె..."

"అది నువ్వే అంటవు... ఇది నువ్వే అంటవు... పాదయాత్రలను మంచియనుకుంటనే విమర్శించుతవు. అంత ఎటమటంగ మాట్లాడ్తున్నవేంది..."

"నేను సరిగ్గనే చెపుతున్న శంకర్...! నువ్వే సమజ్ జేసుకుంటలెవ్వు... పాదయాత్రలయిన ఏవయిన ఓట్లకోసురం శంఖుస్థాపనలన్నట్టు ఉరికురికి జేసుడు మంచిదిగాదు... పాటులల్ల పడన్ననో, ఎప్పటికేదో లొల్లి జేసినట్టు మాట్లాడన్ననో సేత్తె దండుగేమరి...! పాదయాత్రలు మనకు కొత్తయేం గాదు. వెనుకటి రాజులు గూడ సేసెటోల్లు... మారువేషాలల్ల మందిల కలిసిపోయి తిరిగెటోల్లు... మంచి రాజులయితె దీంతో కొంత లాభపడ్డరు..."

"ఎట్లైట్లనే నువ్వేం జెప్పినా గదో తీరుగుంటది..."

"మనం కథలల్ల సదువుకోలేదా వెంకటేశం...! రాజులు మారువేషాలల్ల పోయి ప్రజలతోని కలగలిసిపోయి మాట్లాడెటోల్లు... ప్రజల కష్టసుఖాలను తెలుసుకునెటోల్లు... వాళ్ళేం తింటున్నరో, ఎట్లుంటున్నరో, వాళ్ళ బాధలేందో, సమస్యలేందో తెలుసుకునెటోల్లు... తమ పాలన గురించి వాళ్ళేమను కుంటున్నరో గూడ తెలుసుకొని అవసరమయితె మార్చు కునెటోల్లు. గట్ల ప్రజలల్ల మమేకమై పోతె అసలు విషయాలు తెలుత్తయి. గింత మాత్రమన్న మన నాయకులు ప్రజలల కల్సిపోతె మంచిగుండు... నిజంగ పాదయాత్రలల్ల చిత్తశుద్ధుంటె ఎన్నో లాభాలున్నయి... ఇందులో ప్రజల సంక్షేమం గురించి తెలుసుకునుడుంది. వాళ్ళ బాగోగులు కోరుడుంది. వాళ్ళ కోసం తనను తాను అర్పించుకునుడుంది. ఏదన్న ప్రజలకోసం మంచి చెయ్యాలన్న తపనుంది... అందరు రాజులు గిట్ల జేసింద్రని కాదుగని కొందరు మంచి రాజులు మా చేసింద్రు..."

"మరి గీ ప్రజాస్వామ్యంల గూడ కొందరు ప్రచారం కోసం జేత్తె, కొందరేమొ ప్రజల సంక్షేమం కోసమే సేత్తున్నరనుకోవచ్చుగద...!"

"గా మాట కాదంటలేను... అందరు ఒక్కతీరుగనే ఉంటరనీ అంటలేను... దేంట్లనయిన చిత్తశుద్ధుండాలె... అన్నలతోని చర్చలైనప్పుడు నాయకులంత ప్రజలల్ల మంచిగ కల్సిపెయిరి... మల్ల ఎప్పటాలే ఆయె. నాయకులు ఉళ్ళళ్ళకు పోవన్నంటె కష్టమయితె ఇగ వీళ్ళు చేసేదేంది...? వాళ్ళ సమస్యలెట్ల పరిష్కరిస్తరు..."

"గా మాట నిజమేనే రాజమల్లన్న. మరి గిట్లెందు కైతంది..."

"ఎందుకైతందంటె ఎవ్వల ప్రయోజనాలు వాళ్ళకున్నయ్... ఏదేమైన ప్రజలతోని కలెగలిసిపోయినోడే నిజమైన ప్రజానాయకుడు... గిసొంటి వాట్ని గూడ నాటుకాలలెక్క వాడుకున్నోల్లున్నరు..."

"గట్లెట్లంటవు...?"

"పాదయాత్రలో, ప్రజల దగ్గరికి పోవుడో నాటకాలలెక్క వాడుకున్నోలున్నరు... వీళ్ళు వస్తున్నట్టు చెప్పుతరు... వాళ్ళు వండిపెడుతరు... వాళ్ళింటల్ల తింటున్నట్టు ప్రచారమే కాని వీళ్ళకోసం వండించుకున్నదే అదంత... రోడ్లమీద తానాలు జేసినట్లు, గుడిసెల్ల తిన్నట్టు చూపించేటియన్ని సినిమా హీరోయిన్లు కలుపు తీసుటాన్ని రంగురంగులల్ల చూపినట్టుంటయి. ఎనుకెనుకకు నడ్సుకుంట వొటగొట్టుటాన్ని ఎంతో హాయన్నట్టు చెప్పినట్టుంటయ్... ఆ పనులల్ల ఎంత కష్టముందో ఆ పనులు చేసేటోల్లకే తెలుస్తది. ఎంత జేసినా ఆ ఎవసదారునికి బుక్కెడు బువ్వ గూడ నోట్లెకు రాకుండె. ఆ పాటకు సినిమా హీరో, హీరోయిన్లకు లక్షలస్తయి... పాదయాత్రలసొంటి వాట్ని గూడ గట్ల చెయ్యద్దనేదే నేంజెప్పేది...!"

"మరి గివ్వెట్లుండాలంటవు...?"

"గిండ్ల నిజాయితుండాలె... ప్రజలకు తెలువకుండానే పోవాలె. వాళ్ళతోని వండించుకోని కాకుండ ఇంట్లేదుంటె గదే తినాలె... గడుకుంటె గడ్క, అంబలుంటె అంబలి తాగాలె... గట్ల జేత్తె వాళ్ళేం తింటున్నరో, వాళ్ళ ఇండ్లెటున్నయో తెలుస్తది... వాళ్ళ ఇండ్లల్ల పాయ్‌ఖాలున్నయా, కనీసం తాగే నీల్లున్నయా స్వయంగ తెలుసుకోవాలె. దొడ్డికి పోయేటోల్లు ఊరవతలికి పోవుడు, బిందెడు నీళ్ళకోసం మైళ్ళదూరం పోవుడన్న సంగతి నాయకులు స్వయంగ తెలుసుకోవాలె... వాళ్ళ సిలువేరు గిన్నెలల్ల తినిలె... మట్టె కంచుల్లోన్న తొక్కు రుచి చూడాలె... పాదయాత్రలయిన ఏమయినా అన్నార్తుల కడుపులు నింపెటట్టు, ప్రజల సమస్యలు తెలుసుకునెటట్లుండాలె... సహజంగుండాలె... ఏం ఏర్పాట్లు లేకుండ పోతానే గివ్వన్ని తెలుస్తయి... ఇసొంటి వాటి కోసం పెట్టే లక్షల ఖర్చు ప్రజల తిండికోసం పెడితె మంచిది... ఇవ్వి ఉండాలె. కని ప్రజాస్వామికంగుండాలె..." అన్నడు రాజమల్లు. ★

ఎయిడ్స్, దాని పరిణామాలు, నివారణ నియంత్రణలపై గతంలో కన్నా ఈ నాడు చాలా మందిలో అవగాహన కల్పించబడుతోంది. పరవాలేదు అని అనుకుంటున్నాం. కాని వాస్తవానికి నూటికి 80శాతం వున్న గ్రామీణ ప్రాంతవాసులలో, పట్టణ మురికి వాడలలో దీనిపై పూర్తి అవగాహన కల్పించేవారు లేరు.



ఎయిడ్స్ వ్యాధిని ద్వేషించండి - రోగులను కాదు

ఎంతో మంది అమాయకులు ముఖ్యంగా స్త్రీలు, యువకులు వారికి తెలియకుండానే ఎయిడ్స్ బారినపడి నిర్వీర్యులై, నిస్సహాయులై, సమాజంలో ఈ వ్యాధి పట్ల, దాని సంక్రమణ పట్ల పూర్తి అవగాహన లేమితో, అపోహ, భయం వలన వివక్షకు గురై ఎందరో సభ్య సమాజము నుంచి 'వెలి'కి గురవుతున్నారు. 'ఎయిడ్స్' వచ్చినంత మాత్రాన అదేదో చాలా హీనమైనదిగా, ఏహ్యమైనదిగా, ఆ వ్యాధి సోకినవారు గతంలో మాదిరిగా సమాజంలో కలిసి జీవించదానికి అర్హతలేని వారుగా, బ్రతికుండగానే, ఇంకా ఆరోగ్యవంతులుగా ఉండగానే వారిని అతి దారుణ రీతిలో సమాజ బహిష్కరణ చేస్తున్న విషయం ఎన్నో సందర్భాలలో వింటున్నాం. చదువుతున్నాం. చూస్తున్నాం. ఇది సభ్య సమాజం ఎంతో సిగ్గుపడవలసిన విషయం. కేవలం లైంగిక సంబంధాల వలన, అదీ అనారోగ్య 'సెక్స్' పద్ధతుల వలన అధికంగా అంటే దాదాపు 90 శాతం సంక్రమిస్తుందన్న విషయం తెలుసుకోవాలి. తెలియని వారికి తెలిసిన వారు తెలియజేయాలి. అమాయకత్వంతో, అజ్ఞానంతో కొన్ని సందర్భాలలో తొందరపాటుతో, విచ్చలవిడి శృంగారంతోనో లేక వేశ్యల పొందులో సుఖం కంటే సుఖరోగాలు ఎక్కువ వస్తాయని తెలియక సంక్రమింప చేసుకున్న 'ఎయిడ్స్' ప్రాణాంతకం కావచ్చు! తెలిసి తెలిసి ఎవరూ ప్రమాదాన్ని కొని తెచ్చుకోరుకదా! "ఆమెకో లేక అతనికో ఎయిడ్స్ ట... ఛీ... ఛీ... అమ్మో వాళ్ళకు దూరంగా వుండాలి. వాళ్ళను దూరంగా ఉంచాలి" అని అనుకునే మనం ఒక్కసారి ఆలోచిద్దాం. విధివశాత్తు ఆ వ్యక్తి ఒకవేళ మనమే అయితే అదే విధమైన వివక్షను మన కుటుంబం నుంచి సమాజం నుంచి కోరుకుంటామా... అది ఎంత ఘోరమైన పరిస్థితో ఆలోచించండి.

ఆరోగ్యవంతులైన వారికి హెచ్.ఐ.వి. సోకితే అది ఎయిడ్స్‌గా మారటానికి కనీసం పది సంవత్సరాలైనా పడుతుందన్న విషయం మరచిపోవద్దు. అప్పటి వరకు అతడు కాని, ఆమె కాని తన దైనందిన కార్యక్రమాలు, వృత్తిని నిరభ్యంతరంగా చేసుకోవచ్చని తెలిసినవారు మన చుట్టూ వున్న వారికి తెలియజేయాలి. ఈ వ్యాధిగ్రస్తులతో లైంగిక సంబంధం లేనంతకాలం, వారి రక్తాన్ని స్వీకరించనంతకాలం ఎలాంటి ప్రమాదం లేదని గుర్తు చేసుకుందాం, ప్రచారం చేద్దాం. మన కుటుంబంలో ఎవరికైనా గుండె జబ్బు వున్నా, క్యాన్సర్‌తో బాధపడుతున్నా క్షయ, కుష్టు మొదలైన అంటు లేక ప్రాణాంతకమైన వ్యాధులతో వున్నా కొంతమంది నెల, రెండు లేక మూడు నెలల్లో చనిపోతారని తెలిసినా, వారికి సకల సపర్యలు చేస్తూ మరణించే వరకు వారిని మనతోనే వుంచుకుంటాం. అలాంటప్పుడు ఏ ఐదు సంవత్సరాలకో, 10 సంవత్సరాలకో చనిపోతాడో లేదా అసలు చనిపోడో అనే విషయం తెలియని వారి పట్ల ఎందుకింత కక్ష. ప్రస్తుతానికి వ్యాధికి మందు లేకపోవచ్చు. కాని సరైన మందును కనుగొనే ప్రయత్నాలు ప్రపంచమంతా నిర్విరామంగా జరుగుతున్నాయి. ఆ మందే త్వరలో కనుగొంటే వారి జీవితాలు మళ్ళీ చిగురిస్తాయి. కదా! ఏవేవో ఊహించి, అజ్ఞానంతో, అపోహాలతో వారిని శత్రువులకన్నా హీనంగా కనీసం నిలువ నీడలేకుండా చేయటం ఎంతటి దౌష్ట్యం, అమానవీయత? మన క్రూర, అమానుష చర్యలతో వారినే కాదు వారిపై ఆధారపడిన వారిని ముఖ్యంగా అమాయకులైన పిల్లలను అనాథలుగా మారుస్తున్నాం - మార్చబోతున్నాం. ఆలోచించుదాం. మనలోని మానవతను మేల్కొల్పుదాం. ఆపదలో వున్నవారికి ముఖ్యంగా ఎయిడ్స్ వ్యాధితో, దాని వలన భయంతో ఈ నరికే నగం నిర్జీవులై వున్న వ్యాధిపీడితులను, వారి కుటుంబాలను బ్రతికుండగానే సమాధి చేయక ఆదరణ, ఆప్యాయతలతో అభయ హస్తమందిద్దాం. నేనున్నాను అనే ధైర్యాన్ని, బలాన్ని, సహకారాన్ని అందిద్దాం. వారికీ "జీవించే హక్కు" వుందని ఈ సమాజంలో అందరిలో వారిని భాగస్వాములను చేద్దాం. ఎయిడ్స్ నియంత్రణ/ నివారణ దిశలో గణనీయమైన సేవ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి మనందరి సహకారం అందిద్దాం. ఎయిడ్స్ ఉనికి రాష్ట్రంలో లేకుండా చేద్దాం. "ఎయిడ్స్ వ్యాధిని ద్వేషిద్దాం - కాని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను కాదు" "సర్వేజనః సుఖినోభవంతు" అను మన భారతీయ సంప్రదాయాన్ని, సంస్కృతిని మన తరంలోను ఆచరణలో చూపిద్దాం. యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుద్దాం.



ఎయిడ్స్ చికిత్సలో అశాస్త్రీయ ధోరణులకు అంతమెప్పుడు?

నేడు "ఎయిడ్స్"-పేరుతో కొందరు రోగులను మోసం చేస్తున్నారు. అందులోనూ ఎక్కువగా నకిలీ వైద్యులే ఉంటున్నారు. వీరిలో ఏ డిగ్రీలూ లేని హోమియోపతి, ఆయుర్వేదం వైద్యులమని చెప్పుకుంటున్నవారు కూడా ఉన్నారు. వీళ్ళ ప్రకటనలు రోగులను ఆకర్షించేవిగా ఉంటున్నాయి. వ్యాధి సోకి దిక్కుతోచని రోగి ప్రకటనలు చూసి గంపెడు ఆశతో వీళ్ళను ఆశ్రయించి డబ్బులు వదిలించుకోవడం జరుగుతోంది. ఈ నకిలీ వైద్యులు ఎయిడ్స్ రోగులను నమ్మించి వాళ్లకు అనువుగా ప్రవర్తించి మోసం చేస్తున్నారు. రోగికిలేని రోగాలు కూడా ఉన్నాయని చెప్పడం, మందులు యివ్వడం, డబ్బులు వసూలు చేసుకోవడం జరుగుతోంది. సాధారణంగా వీరు రోగులకు విటమిన్ టాబ్లెట్లను, గొట్టాలను ఎక్కువగా యిస్తున్నారని తెలుస్తోంది. కొందరు యిచ్చే మందులలో ప్రమాదరకమైన స్టెరాయిడ్స్ కూడా ఉంటున్నాయి. కొందరు పొడులు యిచ్చి డబ్బులు దండుకుంటున్నారు. ఉదాహరణకు ఓ వ్యక్తికి



ఇటీవల నకిలీ వైద్యుడు చెప్పినది వింటే... మనకు ఆశ్చర్యం కలుగుతుంది. "ఎయిడ్స్ అనేది నిజానికి చాలా పాత జబ్బు. మన ముత్తాతల కాలం నుండి అది ఉంది. దానికి యిప్పుడు ఎయిడ్స్ అని కొత్తపేరు పెట్టి భయపెడుతున్నారు. మన అధర్వణ వేదంలో ప్రతి రోగానికి మందు ఉంది. నేను యిచ్చే ఈ మందు వాడు, నీకు ఈ జన్మలో ఎయిడ్స్ రాదు, గియిడ్స్ రాదు. నేనిచ్చే మందు తయారుచేయడానికి వాడే వనమూలికలు ఇక్కడెక్కడా దొరకవు. చాలా దూరం నుంచి తెప్పించాను. అవి కూడా కొద్దిగానే ఉన్నాయి. వీటి నుంచి మందు తయారుచేయడానికి చాలా సమయం పడుతుంది. ఇప్పుడు కొద్ది మందు మాత్రమే నా దగ్గర ఉంది. వెంటనే మందు వాడు, లేకపోతే వ్యాధి ముదిరిపోతుంది. వ్యాధి ముదిరాక నా దగ్గరకు వస్తే నేను ఏమీ చేయలేను". ఇలా ఎన్నో... ఎన్నెన్నో.... కథలను గాథలను వినిపించి రోగులను ఒప్పించి వైద్యులులాగా కాసేపు శరీరాన్ని

ఎయిడ్స్‌పై అవగాహన కల్గిస్తున్న ఆరోగ్య కార్యకర్త

పరిశీలించినట్లు నటించి రోగులను మోసం చేస్తున్నారు. అయితే ఈ మోసాన్ని తెలుసుకున్నవారు కూడా లేకపోలేదు. బ్రతుకు మీద తీపికొద్దీ తాము నకిలీ వైద్యుల బారినపడి ఇల్లు, ఒళ్ళు గుల్ల చేసుకున్నామని వ్యధ చెందుతున్నవారూ ఉన్నారు. ఎవరికి వాళ్ళే మాటలతో మభ్యపెట్టి దగా చేసి వేలకు వేలు ఖర్చు పెట్టించి మమ్ములను వెర్రి వాళ్లను చేసి ఆడిస్తున్నారని, దోచుకు తినడానికి మృత్యు ముంగిట్లో ఉన్న మేమే దొరికామా అని వాపోతున్నారు.

ఏది ఏమైనా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. ప్రజలు కూడా మోస పోకుండా ముందే వైద్యులను గురించి తెలుసుకొని మెలగాలి. ముఖ్యంగా పత్రికలు, ప్రచార, ప్రసార సాధనాలు వైద్య సంబంధ వార్తలనుకానీ, వాణిజ్య ప్రకటనలనుగానీ ప్రచురించే ముందు అవి రాసిన లేదా యిచ్చిన వారిని గురించి తెలుసుకొని ఆ ప్రకటన లేదా వార్త ఇచ్చిన వారు అందుకు అర్హులా? కాదా? ఆధారాలు ఉన్నాయా? మొదలయిన వాటిని నిర్ధారించుకొని ప్రచురించాలి. ప్రసారంచేయాలి. అప్పుడే నకిలీ వైద్యుల బెడద తగ్గే అవకాశం ఉంటుంది. ★



వెయ్యేళ్ళ చరిత్ర

వెయ్యేళ్ళచరిత్ర
రచన: తెలికపల్లి రవి,
క్రీ.శ. 1100-2003
ప్రపంచ పరిణామాలు,
ప్రచురణ: ప్రజాశక్తి బుక్‌హౌస్,
హైదరాబాద్- 500 020,
వెల: రూ. 60/-,
పేజీలు: 161.

చరిత్ర గర్భంలో కలిసిపోయిన వెయ్యేళ్ళ చరిత్రను యీ గ్రంథంలో పొందుపరిచే ప్రయత్నం ఇది. కేవలం 161 పుటల్లో, వెయ్యి సంవత్సరాల్లో ప్రపంచంలోని ముఖ్య చారిత్రిక ఘటనల్ని కేటలాగు రూపంలో యివ్వాలనుకున్నా జరగనిపని. కానీ, గ్రంథకర్త 'రేఖామాత్రంగా' చరిత్ర ఘటనల్ని రచిస్తున్నానని అన్నారు. అది కొంతవరకు నిజమే, ఇందులోని చరిత్ర దేశహద్దులను దాటి, అన్ని ముఖ్యాంశాలను, సవివరంగా చెప్తున్నట్లే అన్పిస్తుంది. 'కొండ అద్దమందు కొంచెమై వుండదా' అన్నరీతిలో సాగింది రచన. 18,19 శతాబ్దాలదాకా చరిత్ర ప్రధానంగా ఐరోపా, ఆసియా ఖండాలకే పరిమితమై వుండేది. చరిత్రకారులు, రాజకీయవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, ప్రపంచ చరిత్రను ఐరోపా కేంద్రంగా పరిగణించారు. దీనికి కారణాలు అనేకం. అదివేరే చర్చ. కానీ, ఆ వెయ్యేళ్ళలో ఐరోపా చరిత్ర ఆసియాఖండంతో బలంగా పెనవేసుకుపోయింది. ఇది ముఖ్యంగా 15వ శతాబ్దం తర్వాత, సాంస్కృతిక పునరుజ్జీవనం జరిగాక సంభవించింది. ఈ గ్రంథ రచయిత ఆ రకమైన ఐరోపా కేంద్ర ప్రపంచ చరిత్రకు గండికొట్టి, ఆసియాఖండ ఘటనలకు ప్రాముఖ్యమిచ్చి, సమతుల్యాన్ని సాధించారు. భారతదేశ చరిత్రలో జరుగుతున్న ముఖ్య ఘటనలను, ప్రపంచ చరిత్రలో భాగంగా, జమిలిగా వర్ణించడంవల్ల ఇది సాధ్యమైంది. పైగా ప్రపంచంలో వివిధ దేశాల్లో జరుగుతున్న ఘటనలను వేరుచేసి, భిన్నంగా చూడకుండా, వాటి మధ్యనున్న అంతస్సంబంధాలను వివరించారు. చరిత్ర రచనలో ఇది శాస్త్రీయదృష్టి. కార్యాకారణ సంబంధం చారిత్రక ఘటనలను వివరించడంలో, విశ్లేషించడంలో, ఎంతో ముఖ్యపాత్ర వహిస్తుంది, అంతస్సంబంధాల వివరణ చరిత్రకు సమగ్రతను సమకూర్చి మానవసమాజాలు, అది సృష్టించిన నాగరికతా సంస్కృతుల మధ్యగల పరస్పరాలంబనాన్ని తెలియజేస్తుంది. చరిత్ర గమనానికి, మానవసమాజాల పురోగతికి ఇది ముఖ్యం. గ్రంథకర్త తన రచనలో, ప్రతి అధ్యాయంలో యీ పద్ధతిని పాటించారు. 'చారిత్రక విభాతం'తో మొదలై 'చరిత్రా ముందుకు పద' తో ముగిసిన యీ గ్రంథంలో 30 అధ్యాయాలున్నాయి. వెయ్యేళ్ళ చరిత్రకు తెర తీసినట్లుగా, చారిత్రక విభాతంలో ప్రాచీన నాగరికతలు - ఈజిప్టు, మెసపటోమియా, హరప్పాలతో పాటు, రోము సామ్రాజ్య పతనంతో ముగించి వెయ్యేళ్ళ చరిత్రను స్థూలంగా మధ్యయుగాలనబడే కాలంనుండి ఆరంభించారు. వాస్తవానికి చరిత్రలో మధ్యయుగాలు 11వ శతాబ్దానికి ముందే, 8వ శతాబ్దినుండే ఆరంభమయ్యాయి. దీన్ని తొలిమధ్యయుగమని అంటారు. వెయ్యేళ్ళ చరిత్రను రాయాలనుకోవడమే సాహసం. అందులోనూ, క్లుప్తంగా సామాన్య పాఠకులకు కావాల్సిన రీతిలో రచించడం మరీ కష్టం. చక్కగా, సమర్ధవంతంగా, సులభశైలిలో, పాఠకులను చదివింపజేసేట్టుగా ఆసక్తికరంగా సాగింది ఈ రచన. ఒక వృత్తి చరిత్రకారుడు చేయలేని పనిని, చరిత్ర కారుడు కాకపోబట్టే, తెలికపల్లి రవి చేయగలిగాడు. ఇంతటి బృహత్తర పరిధిగల రచనలో లోటుపాట్లు, చారిత్రక ఘటనల్ని పరిశీలించిన తీరులో విభేదాలు తప్పనిసరిగా వుంటాయి. వాటితో ప్రమేయంలేకుండా, ఈ గ్రంథం సామాన్యపాఠకులకు అవశ్యపఠనీయం.

- వకుళాభరణం రామకృష్ణ

నమ్ముకున్న రాజ్యానికి అక్షర రూపం

వెన్ను విరిగిన రాయలసీమ వ్యవసాయరంగం, సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన విషయాల మేళవింపుతో శాంతి నారాయణ "నమ్ముకున్న రాజ్యం" కథల సంపుటి వెలువడింది. వృత్తులు, ఉపాధి కోల్పోయి రైతులు, వ్యవసాయ కూలీలు పడుతున్న ఈతి బాధలకు అక్షరూపం ఇచ్చారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల గ్రామ స్వరాజ్యం గల్లంతు కావడం, వందలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పాలకులు స్పందించక పోవటం వంటి విషయాలను హృద్యంగా వివరించారు. ఆర్థిక సంబంధాలు మానవీయ విలువలను, సామాజిక సంబంధాలను ఎలా ధ్వంసం చేస్తాయో మనకు చూపిస్తారు. ఆకలి అమ్మపేగును అంగడి సరుకును చేస్తుంది, దీనికి కారకులెవరో స్పష్టంగా, సూటిగా చెప్పారు. పాత్రల, స్థలాల చిత్రీకరణ సొంతం అనంతపురం జిల్లాకు సంబంధించినవే.

సమస్యమూలాల్లోకి వెళ్లకుండా ప్రభుత్వం తనదైన శైలీలో పంటలు మార్చాలని చెబుతుంది. ఇంకాస్త ముందుకెళ్లి ఉచితంగా మందు డబ్బాలు పంపిణీ చేస్తుంది. వాటిని తాగే మల్లన్న ఆత్మహత్యకు పాల్పడతాడు. "ఆవును చంపి చెప్పులు దానం చేసినట్టు" అంటూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని "రత్నాలసీమలో" తూర్పారబట్టారు.



"నమ్ముకున్న రాజ్యం"
రచయిత:శాంతినారాయణ
అనంతపురం.
ప్రతులకు: విశాలాంధ్ర
బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు
వెల: రూ. 50/-

దారిద్ర్యం పేదరికం విలయ తాండవం చేస్తున్న చోట ఓ మహిళ అమ్మతనాన్ని అద్దెకిచ్చిన తీరును "అద్దెతల్లి" కథలో అద్భుతంగా ఆవిష్కరించారు. మృత్యుఒడికి చేరువలో ఉన్న కుమారున్ని, వృద్ధులైన అత్మమామలను బతికించుకోవడానికి "సుజాత" సమాజాన్ని ఎదిరిస్తుంది. న్యాయవ్యవస్థకు సవాల్ విసురుతుంది. కష్టనష్టాలను ఎదురీది అమ్మగా సాక్షాత్కరిస్తుంది. వేషాల మాటున దాగిన మోసాలను, దుర్మార్గాలను"స్వాములు"లు కథలో బట్టబయలు చేస్తారు. రంగన్న, నాగమ్మల లాంటి కోట్లాది మంది జీవితాలను "ఈ పయనం ఎక్కడికి" కథలో వివరిస్తారు. భూమినే నమ్ముకుని జీవనం వెళ్లదీస్తున్న వారి బతుకులు ఎలా మసిబారుతున్నాయో చెప్పిన తీరు మనస్సును కదిలిస్తుంది. పురుషాధిక్యతకు చెంప పెట్టు "శాలిని" కథ. మగాధిక్యత మెడలు వంచుతుంది శాలిని.

కిందిస్థాయి కమ్యూనిటీకి చెందిన కొందరు పై స్థాయికి వెళ్లగానే తమ ఎదుగుదలకు పునాదులేసిన వారిని మర్చిపోతారు. వారిగురించి పట్టించుకోరు. పురుగులను చూసినట్లు చూస్తారు. ఇదే విషయాన్ని ''తులసివనంలో తుమ్మచెట్లు'' కథలో మనముందుంచుతారు.

కరువుతో విలవిలాడుతూ కన్నబిడ్డలనే అమ్ముకునే సుగాలీల జీవితాలకు అద్దం పట్టేవిధంగా వ్యక్తీకరించిన కథ "నమ్ముకున్నరాజ్యం". పాలకుల నిర్లక్ష్యానికి మచ్చుతునకలు వీరి జీవితాలు."యాగవుర్మెంటు రైతును ఆదుకుంటాదన్నా, యెన్నో గవుర్మెంట్లొచ్చిపాయ. యాదీ యెవసాయం పక్క కన్నెత్తి చూడకపాయ." అంటూ గంగానాయక్ చేత సర్కార్‌ను ఒక చరుపు చరిచారు. కథ చదువుతుంటే కళ్లు చెమర్చుతాయి.

రాయలసీమ మాండలికంలో, ఆవేదనతో, అక్రోశంతో రాసిన ఈ కథలు పాఠకులలో చైతన్యాన్ని నింపుతాయి, ఆలోచింపచేస్తాయి.

- జి. బుచ్చయ్య

స్వీకారం

కన్నీళ్ళ సాక్ష్యం
గవిడి శ్రీనివాస్
వెల: రూ. 30/-
పేజీలు: 60
ప్రతులకు:
విశాలాంధ్ర
అన్ని బ్రాంచీలు

మసక
మునిసుందరం
వెల: రూ. 50/-
పేజీలు: 60
ప్రతులకు:
శ్రావణి ప్రచురణలు
10-3-190ఎ2,
కోటకొమ్మలవీధి
తిరుపతి.

గులాబీరంగు అందాల జైపూర్

సి హెచ్ వి వి రఘుబాబు

జైపూర్ కోటలను పూర్తిగా సందర్శించాలంటే కనీసం రెండు రోజులైనా పడుతుంది. సుదూరంగా కనిపించే పచ్చటి పర్వతశ్రేణుల మధ్య నుంచి నగరంలోకి ప్రవేశించగానే ఎత్తైన ఎర్రరాతి కట్టడాలు మనల్ని ఆకర్షిస్తాయి. జల్‌మహల్, హవామహల్, సిటీప్యాలెస్, జంతర్‌మంతర్, పింక్‌సిటీలను స్వయంగా చూసి తీరాల్సిందే.



సిటీప్యాలెస్

జైపూర్ కోట

ఆధునిక జాడలు అణువైనా కనిపించకుండా ప్రాచీన శోభతో మనల్ని పరవశింపచేసే నగరం జైపూర్. సవై మాన్‌సింగ్ ఆసుపత్రి తదితర భవనాలను తిలకించినపుడు ఆ సౌందర్యానికి పరవశించిపోతాం. భారతీయ వాస్తు శైలికి అద్దంపడుతూ పొందికగా సాగిన పింక్‌సిటీ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. శాంతి, స్వచ్ఛత, అభివృద్ధిలకు ప్రతీకగా గులాబీ రంగులను భావిస్తుంటారు. ఆ ఉద్దేశ్యంతోనే మహారాజులు జైపూర్‌లో ప్రత్యేకంగా పింక్ కలర్‌ను మాత్రమే వినియోగించారు. లోపల ఎవరి అభిరుచులకు వారు రంగులను వేసుకోవచ్చు. ఈ మేరకు రాజస్థాన్ ప్రభుత్వం విస్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది కూడా. శిథిలమైన కట్టడాలను తొలగించి కొత్త నిర్మాణం చేపట్టినప్పుడు కూడా ఈ వర్ణ నిబంధన వర్తిస్తుంది. బహుళ అంతస్థుల "హవా మహల్" ప్రత్యేక ఆకర్షణ. గాలి వెలుతురు వంటి సహజ వనరులు సద్వినియోగం అయ్యేలా దీనిని రూపొందించారు. జైపూర్ నగరంలో ఎక్కడ చూసినా చరిత్రలో నడచినట్లే ఉంటుంది. రిక్షాలు, ఆటోలకు పోటీగా ఒంటెల బళ్లు కూడా కనిపిస్తాయి. మరో విశేషమేమంటే ఎక్కడపడితే అక్కడ ఆప్యాయంగా మనల్ని పలకరించే పావురాలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. స్వేచ్ఛగా గాలిలో ఎగురుతూ పర్యాటకులకు కనువిందు చేస్తుంటాయి. విశాలమైన జలమధ్యంలో సగౌరవంగా నిలిచిన "జల్‌మహల్" త్వరలో పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోబోతుంది. దీనిని రెస్టారెంట్‌గా మార్చేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మాన్‌సింగ్ పాలనా



హవా మహల్

వైభవాన్ని ఆయన హయాంలో సాగిన నిర్మాణ రీతుల్ని తెలుసుకునేందుకు దేశవిదేశాల నుండి వేలాదిమంది పర్యాటకులు జైపూర్‌నగరం వస్తుంటారు.

సిటీప్యాలెస్

జైపూర్ రాజవంశాల ఘనమైన చరిత్ర చాటిచెప్పే అద్భుత కళాఖండాల సమాహారం మహారాజా సవాయ్ మాన్‌సింగ్-2 మ్యూజియం. సిటీమహల్‌లో దీనిని 1959లో ఏర్పాటు చేశారు. సిటీ మహల్ ముందరి భాగంలో ఇస్లామిక్, యూరోపియన్, రాజపుత్ర శిల్పరీతులను ప్రతిబింబించే ముబారక్ మహల్ కనిపిస్తుంది. దీని లోపల భాగంలో టెక్స్‌టైల్స్ కాస్ట్యూమ్స్, గ్యాలరీ ఉంటుంది. మహారాజ సవాయ్ మాధోసింగ్ ఏడు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పున భారీ కాయంతో ఉండేవారు. ఆయన ధరించిన కుర్తా ఈ గ్యాలరీలో ప్రత్యేక ఆకర్షణ. ఈ గ్యాలరీ అనంతరం మిలమిల మెరిసే పాలరాతి ఫలకాలతో తీర్చిదిద్దిన రాజేంద్రపూల్ వివిధ ఆయుధాలను పొందుపరచిన షెలేఖానా కూడా సందర్శక ప్రాంతాలే. తదుపరి "పేతంనివాస్ చౌక్" నాలుగు గేట్లతో కళాత్మకంగా ఉంటుంది. దీని ముందరి భాగంలో ఏడంతస్తులతో ఉన్న చందన్ మహల్ రాజవంశీయులకు అనధికార నివాసంగా ఉండేది. దీనిలోకి ప్రవేశం ప్రస్తుతం నిషిద్ధం. సర్వతభద్రగా పిలిచే ప్రాంతంలో రెండు భారీ వెండి జాడీలను చూడవచ్చు. దీని నుంచి ముందుకు వెళితే మ్యూజియం వస్తుంది. అరుదైన చిత్తరువులు, తివాచీలు, రాజప్రతులు, రాజవంశీలు వినియోగించిన వివిధ వస్తువులు ఈ మ్యూజియంలో తిలకించవచ్చు. ఈ మ్యూజియంలోనే జైపూర్ ప్రాంతంలో లభించే అరుదైన రాళ్లతో రూపొందించిన గొలుసులు, ఆభరణాలు కొనుగోలు చేయవచ్చు. మ్యూజియం హాలులో విద్యుత్ కాంతుల వెలుగుల మధ్య ఆనాటి రాజవంశాల జీవన శైలిని ప్రతిబింబించే వస్తువులను, వస్త్రాలను చూడడం అరుదైన అనుభూతి. వివిధ సందర్భాలను, చారిత్రాత్మక సన్నివేశాలను వివరించే వివిధ చిత్తరువులు ఇప్పటికీ ఆకర్షణీయంగా ఉండడంతో పాటు సంక్షిప్త సమాచారాన్ని సందర్శకులకు అందిస్తాయి. ఇక్కడ వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ అనుమతించరు. మహారాజులు వినియోగించిన రథాలను ప్రత్యేకంగా బగ్గికానాలో పొందుపరిచారు. యురోపియన్ శైలిలో రూపొందించిన రథాలను జైపూర్‌కు రప్పించిన మహారాజు స్థానిక రీతులకు అనుగుణంగా దాన్ని తీర్చిదిద్ది వినియోగించేవారట. వివిధ ఉత్సవాల్లో ఉపయోగించే రథాలను కూడా ఇందులో చూడవచ్చు. విక్టోరియా బగ్గీ, తకుర్జీ కా రథ్ ప్రత్యేక ఆకర్షణ. ★



జైపూర్ కోట

స్వాతంత్ర్య సమరయోధుడు, సంస్కరణవాది, అభ్యుదయగామి

శ్రీ కాట్రగడ్డ మధుసూధనరావు

వి.ఆర్. బొమ్మారెడ్డి
ప్రజాశక్తి, మాజీ ఎడిటర్

ప్రఖ్యాత స్వాతంత్ర్య సమర యోధుడు, జీవితాంతం అభ్యుదయవాదిగా తన జీవితాన్ని కొనసాగించిన శ్రీ కాట్రగడ్డ మధుసూదనరావుగారి విగ్రహాన్ని విజయవాడలోని మొగల్రాజపురంలోని మధు సెంటర్‌లో గత సంవత్సరం 29వ తేదీన (2004 ఫిబ్రవరి 29) నెలకొల్పడం దేశాభిమానులందరికీ సంతృప్తిని కలిగించే విషయం. అందునా ఆయన విగ్రహాన్ని మరో స్వాతంత్ర్యయోధుడు, ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ సూర్జిత్‌సింగ్ బర్నాల ఆవిష్కరించడం అత్యంత సముచితంగా ఉంది.

మధుసూదనరావుగారు 1902 ఆగస్టు 15వ తేదీన విజయవాడ మొగల్‌రాజపురంలో ఒక ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. జాతీయ భావాలు గల కుటుంబంలో పుట్టిన కారణంగా యువకుడుగా వున్నప్పుడే ఆయనకు జాతీయ భావాలు ఆకట్టుకున్నాయి.

మధూకళామండపం సెంటర్‌లో కాంస్య విగ్రహం

ఆ కారణంగానే స్వాతంత్ర్య సమరానికి గాంధీజీ పిలుపునందుకొని ఆయన తన కుటుంబ సభ్యులతో సహా జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు. కృష్ణాజిల్లాలో కాంగ్రెస్ ఉద్యమాన్ని నిర్మించడంలో ముఖ్యమైన పాత్రను నిర్వహించారు. జిల్లాలో సత్యాగ్రహ శిబిరాలను నిర్మించడంతోపాటు ఈడ్పుగల్లులో సేవాశ్రమాన్ని స్థాపించి నిర్వహించారు.

గాంధీజీ పిలుపునందుకొని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందున 1930 మేలో ఆయనకు ప్రభుత్వం సంవత్సరన్నర కాలంపాటు ప్రభుత్వం కఠిన జైలుశిక్షను విధించింది. రాజమండ్రి, నెల్లూరు, వెల్లూరు, ఆలీపురం జైళ్లల్లో ఆయన ఆ శిక్ష అనుభవించారు. గాంధీ – ఇర్విన్ ఒడంబడిక ఫలితంగా ఆయన 1931 మార్చిలో జైలునుండి విడుదలయ్యారు. ఆ తరువాత మరల శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందున 1932 జనవరిలో ఒక సంవత్సరం కఠిన కారాగారశిక్షను ప్రభుత్వం విధించింది. జైలునుండి విడుదల అయిన తరువాత కాంగ్రెస్ కార్యకలాపాల్లో పాల్గొనడంతో పాటు హరిజన సేవాసంఘం, తదితర అభ్యుదయ ఉద్యమాలకు అండగా కృషిచేశారు.

నైజాం నవాబు నిరంకుశ పాలనను, అక్కడ సాగుతున్న ఫ్యూడల్ వ్యవస్థను నిర్మూలించి తెలుగు ప్రజలందరి చిరకాల వాంఛ అయిన విశాలాంధ్రలో ప్రజా రాజ్య స్థాపనకై అక్కడ జరుగుతున్న సాయుధ పోరాటానికి సహాయంగా కోస్తా ఆంధ్రా ప్రాంతంలో విరాళాల సేకరణలో పాల్గొన్నారు.



మాకినేని బసవ పున్నయ్య, తరిమెల నాగిరెడ్డి ప్రభృతులతో పాటు విరాళాలను సేకరించడంలో మధుసూధనరావు గారు ముఖ్య పాత్రను నిర్వహించడం విశేషం.

కాంగ్రెస్ కార్యకలాపాలను కృష్ణాజిల్లాలో నిర్వహించుతున్న సమయంలో మధుసూధనరావుగారు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్యగారి నాయకత్వం పట్ల విశ్వాసాన్ని పెంచుకున్నారు. స్వాతంత్ర్య సాధనకు కమ్యూనిస్టు పార్టీ ముఖ్యమైన పాత్రను నిర్వహించుతుందన్న నమ్మకంతో కమ్యూనిస్టు పార్టీకి సహాయపడటం ప్రారంభించారు. ఈ సందర్భంగానే కమ్యూనిస్టు పార్టీ తన తొలి కమ్యూనిస్టు దినపత్రిక ప్రజాశక్తిని స్థాపించినప్పుడు మొగల్‌రాజపురంలోని తన పొగాకు బ్యారన్‌ను ప్రజాశక్తిప్రెస్, పత్రికా కార్యాలయాన్ని నెలకొల్పుకునేందుకు యిచ్చి సహాయపడ్డారు.

మధుసూధనరావుగారు కమ్యూనిస్టు కాకపోయినప్పటికీ ప్రజాశక్తి పత్రిక నిర్వహణకు తన స్థలాన్ని యిచ్చి తోడ్పడ్డారన్న కక్షతో ఆయనకు ఇతర కమ్యూనిస్టు నాయకులతోపాటు జైలులో డిటెన్యూగా నిర్బంధించడం జరిగింది. తాను కమ్యూనిస్టును కాదని

'మనం' మనకి తెల్వకుండానే

నట్టింట్లోకొచ్చిన ఎల్.పి.జి మానస పుత్రిక
వికటాట్టహాసం చేస్తుంది ఉదయాన్నే
అమెరికా అల్లుని కోసం
అలుసటెరగని పరుగులు ఆయాసంతో...
కుంచించుకున్న గుండె భారమవుతూనే ఉంది
మనదికానిదేదో మన ముందుకొచ్చింది
మనల్ని మనంగా
తిననీయని త్రాగనీయని మాటడనీయనిదేదో...
నేలవిడిచి సాముచేస్తున్నట్లుగా!
తల్లిపాలకి రంగులద్దిన వైనం
పరాయీకరించబడ్డ జీవితాలమధ్య

సజీవశవాలుగా 'మనం' 'గ్లోబల్ విలేజ్'
జపమాచరిస్తూ
ఇప్పుడూ...
కట్టెదేహాలే మనవి
బుర్రలెప్పుడో హైజాక్ చేబడ్డాయ్ మిత్రమా...
అన్నింటికీ సమాధానం
అవతలివాడు చెప్పిందాంట్లో
ఉందనుకున్నంతకాలం
'మనం' మనంగా మసలలేం సుమా!!

– సైదులు ఐనాల



1946లో కామ్రేడ్ రజినీపామీదత్ వచ్చిన సందర్భంగా

లిఖితపూర్వకంగా వ్రాసియిస్తే జైలునుండి విడుదల చేస్తామని అనాటి రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు వర్తమానం పంపింది. తాను కమ్యూనిస్టును కాదనీ, కృష్ణాజిల్లాలో ప్రముఖ కాంగ్రెస్ నాయకుడని, చిరకాలం జిల్లా కాంగ్రెసు కార్యదర్శిగా పనిచేసినట్లు ముఖ్యమంత్రితో సహా అందరికీ తెలిసినప్పటికీ అలా రాసి యివ్వమనడం తన ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమేనని స్పష్టంచేసి, జైలులో వున్నారు. అంతటి నిజాయితీ, ఆత్మాభిమానం గల కాంగ్రెసు నాయకుడు శ్రీ మధుసూధనరావుగారు. స్వాతంత్ర్య సమరంలో ముఖ్యపాత్ర వహించినందుకుగాను కేంద్ర ప్రభుత్వం ఆయనకు తామ్రపత్రం జారీచేసింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆయన ఏ పదవులను ఆశించకుండా ప్రగతిశీల కార్యకలాపాలకు అండగా వుంటూనే ఆదర్శ వ్యవసాయదారుడుగాను, పరిశ్రమాధిపతిగాను జీవితాన్ని గడిపారు. క్రియాశీల రాజకీయాలకు దూరంగా వున్నప్పటికీ మధుసూధనరావుగారు, కులమత విభేదాల నిర్మూలనకు, హరిజన తదితర దళితవర్గాల అభ్యున్నతికి జరిగే కార్యక్రమాలకు తగురీతిలో సహాయపడటం తన ధ్యేయంగా తన జీవితాంతం వుంచుకున్నారు.

కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ఆయన అధ్యక్షుడుగా పనిచేస్తూ స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రచురించడానికి తోడ్పడ్డారు. స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం యిచ్చు పెన్షన్ తాను తీసుకోకుండా ఆ మొత్తాన్ని స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి యిచ్చేవారు. ఈ విషయంలో ఆయన సోదరులు నారాయణరావు, భవాని గారులు కూడా ఆయనను అనుసరించారు.

మధుసూధనరావుగారికి సుందరయ్య గారంటే ఎంతో విశ్వాసం, భక్తిశ్రద్ధలు వుండేవి. కార్యకర్తలందరికి ఆయన ఆదర్శమని నమ్మేవారు. సుందరయ్యగారు స్వాతంత్ర్య సమరానికి, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి విజయవాడను కేంద్రంగా చేసుకొని కృషి చేశారని, అందువలన ఆయన జ్ఞాపకార్థం నిర్మించే విజ్ఞాన కేంద్రాన్ని హైదరాబాద్‌లో గాక, విజయవాడలో నిర్మించడం సముచితమని ఆయన వాదించేవారు. హైదరాబాద్‌లో ఆ సంస్థను నిర్మించిన తరువాత విజయవాడలో కూడా ఆయనపేరిట ఒక స్మారక కేంద్రాన్ని నిర్మించాలన్నది ఆయన ప్రగాఢ వాంఛ. విజయవాడలో ఆయనపేరిట ఒక విజ్ఞాన కేంద్రాన్ని, బడుగువర్గాల అభ్యున్నతికి కృషి చేసే కార్యకర్తల శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయాలనేది ఆయన సంకల్పం. ఈ విషయాన్ని ఆయన మార్క్సిస్టు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తెలిపారు. అందుకోసం విజయవాడ సమీపంలో ఒక ఎకరం స్థలాన్ని సంపాదించి యివ్వగలనని చెప్పారు. పార్టీపట్ల తన అభిమాన సూచకంగా పదివేల రూపాయల విరాళాన్ని కూడా పంపించారు. ఆయన సూచనకు పార్టీ నాయకత్వం అంగీకరించింది కూడా. అయితే తన లక్ష్యం నెరవేర్చకముందే అకస్మాత్తుగా ఆయన కన్నుమూయడం సంభవించింది.

కాట్రగడ్డ మధుసూదనరావుగారి కుటుంబ సభ్యులు - ముఖ్యంగా అన్నదమ్ములు జాతీయ ఉద్యమంలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పాల్గొన్నవారే. ఆయన అన్నగారైన రఘురామయ్య గారితో కలిసి మధుసూధనరావుగారు విద్యా విషయంలో వెనుకబడివున్న విజయవాడలో ఆంధ్ర లయోలా కాలేజి నిర్మాణానికి ఎంతగానో శ్రద్ధ వహించి కృషిచేసిన విషయం ఈనాటి తరంవారికి తెలియకపోవచ్చు. రఘురామయ్యగారు ఆనాడు ప్రజాశక్తి పత్రిక ట్రస్టుకు అధ్యక్షులుగా కూడా వున్నారు. ఆయన తమ్ముడు కాట్రగడ్డ నారాయణరావుగారు స్వాతంత్ర్య ఉద్యమంలో అనేకసార్లు జైలు శిక్షలను అనుభవించారు. ఆయన ఆదినుండి కమ్యూనిస్టు ఉద్యమానికి అండగా వుండేవారు. కమ్యూనిస్టు పార్టీ సహాయంతో ఆయన మద్రాసు శాసనసభకు కాంగ్రెసు అభ్యర్థిగా ఎన్నికయ్యారు. అలాగే మరో సోదరుడు కాట్రగడ్డ శ్రీనివాసరావుగారు స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా, ఉద్యమానికి ఆ తరువాత సుందరయ్యగారి నాయకత్వంలో విశ్వాసం పెంచుకొని, ప్రజాశక్తి పత్రిక కార్యాలయ భవన నిర్మాణానికి గవర్నరుపేటలో విలువైన తన స్థలాన్ని దానం చేశారు. సుందరయ్యగారి జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం కమ్యూనిస్టు కార్యకర్తల శిక్షణకుగాను పాతికవేల రూపాయలను తాను జీవించి ఉన్నంతకాలం క్రమం తప్పకుండా యిచ్చేవారు.

ఈ విధంగా మధుసూధనరావుగారి స్ఫూర్తితో ఆయన ప్రోత్సాహంతో కాట్రగడ్డ సోదరులు జాతీయోద్యమానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతగానో తోడ్పటం జరిగింది. అలాంటి మధుసూదనరావుగారి దేశభక్తి, స్ఫూర్తి విజయవాడ పేరుకు ఆదర్శంగా వుండేందుకు ఆయన శిలా విగ్రహం తోడ్పడుతుందనే విషయంలో ఎలాంటి సందేహంలేదు. విజయవాడ పౌరులు గర్వించదగిన సుపుత్రుడుగా ఆయన కలకాలం వెలుగొందుతారు. ★

ఆ స్త్రీలు

కల్లాకపటమెరుగని ఆ స్త్రీలు...
చీకటి మొక్కకు పూసిన వెలుగు పూలు.
జీవన ఋతువుకు గొంతును
సరిచేసుకునే లేత వెదురు వేణువులు.

ఆ స్త్రీలు...
సాయం సమయాన,
కొన్ని రూకలుకేసి
నడిచొచ్చే చొంగల్ని రూకలుగా చూసి...
ఆశ పడతారు.
శరీరాన్ని వాణిజ్య వస్తువుగా చేసుకున్న జీవన సమయాల్ని
మౌనహింసగా... హింసామౌనంగా...

ఆ స్త్రీలు...
ఆకలి వలయం నుండి
తూనీగలా బయటపడేందుకు
వ్యాపార కూడలిలో మైనపు బొమ్మలుగా నిలబడినప్పుడు
కనులతో, అశ్లీల తూటాలను వేసిన
పురుషత్వాన్ని చూచి నవ్వుకుంటారు.

ఆ స్త్రీలు...
వలువలు విడిచి
బిడియాన్ని గుండెల్లో దాచుకొని
బాధా సముద్రాలను, వెదజల్లే
సునామీలు.

ఎవరయినా శిక్షలు వేస్తారు.
శరీరాన్ని వెలుగులో ఉంచిన
ఆ స్త్రీలకు కూడా శిక్షలుంటాయి
దేశాన్ని మానభంగాల కేంద్రంచేసి
ఆరేళ్ళ చిన్నారులపై అత్యాచారానికి
ప్రేరణ అయిన,
సిగ్గు వదిలేసిన, కదిలే రంగులబొమ్మకు
తగిన శిక్షవేశాక
అరచేతిలో రూపాయి దాచుకున్న,
మాకు శిక్ష వేయండి అని ఆ స్త్రీలంటే,
వ్యాపార ప్రకటనల సుందరికి,
స్త్రీని, వ్యాపారదినుసుగా మార్చిన,
గ్లోబలైజేషనుకు, శిక్ష వేయమని
ఆ స్త్రీలు అడిగితే...

\- అరసవిల్లి కృష్ణ

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

తెలియకుండా అమ్మితే...?

మా నాన్న మాకు తెలియకుండా మా ఇల్లును అమ్మివేశాడు. అప్పుడు మా వయస్సు 11 సం॥లు. దానిని తిరిగి తీసుకోవడం కోసం పోలీసుకేసు పెట్టవచ్చా లేదా కోర్టుకు పోవచ్చా? తగిన సలహా ఇవ్వగలరు.

ఒక నిస్సహాయుడు,
వర్థన్నపేట, వరంగల్.

మీ ఇల్లు పూర్వీకులదా లేదా మీ నాన్నగారి స్వార్జితమా అన్నది చెప్పలేదు. పూర్వీకులదయితే కుటుంబ అవసరాల నిమిత్తం అంటే పిల్లల చదువులకోసం, ఆరోగ్య అవసరాలకోసమయితే మీ తండ్రి అమ్మడానికి హక్కుఉంది. స్వార్జితమవుతే తన స్వంత అవసరాలకోసం ఎలాగైనా అమ్ముకోవచ్చు. పూర్వీకులదయితే కుటుంబంకోసం కాకుండా తన స్వంతం కోసం అమ్మితే. అమ్మిన మీ నాన్నగారిని, కొన్న వ్యక్తిని కలిపి దావా వేయవచ్చు. దావావేసి మీ వాటా కోర్టుద్వారా అడగవచ్చు.

రిట్ పిటీషన్ వేయండి

నా తండ్రి ది నిజాం షుగర్స్ లిమిటెడ్ ప్రభుత్వ సంస్థ, మిర్యాలగూడెం యూనిట్ నందు పనిచేసేవాడు. 26-5-1994న సర్వీసులో ఉండగా అనారోగ్యకారణంగా మరణించాడు. కాంపెన్సేషన్ కింద ఉద్యోగం ఇవ్వమని అప్పుడే 1994లో జనరల్ మేనేజర్‌గారికి దరఖాస్తు ఇచ్చాను. అయినా ఇవ్వలేదు. నా తండ్రికి ముందు మరణించిన 1990-91 వారి వారసులకు ఉద్యోగాలు ఇచ్చారు. నాకు ఇవ్వలేదు. ఎం.డి. హైదరాబాద్ వారికి ఎన్నోసార్లు విన్నవించినా లాభం లేకపోయింది. 1998లో హై కోర్టు ఉద్యోగం ఇవ్వమని జి.యం. ఎం.డి.లను ఆదేశించినా ఇవ్వలేదు. ఫ్యాక్టరీ మూసివేసి, అమ్మేసి వర్కర్స్‌కి వి.ఆర్.ఎస్ రియంబర్స్ కింద ఇచ్చి తీసివేశారు. 2002వ సంవత్సరంలో మిర్యాలగూడ జి.యం. నా అప్లికేషన్ హెడ్ ఆఫీస్ హైదరాబాద్‌కి ఉద్యోగం లేదా కాంపెన్సేషన్ పేటెంటు ఎదో ఒకటి ఇవ్వమని ఫార్వార్డ్ చేశారు. అయినా లాభం లేకపోయింది. జనరల్ డెత్‌కి ఇవ్వం అని అంటున్నారు. ఆన్‌డ్యూటీలో చనిపోయినవారికి రెండు లక్షలు వారి వారసులకు ఇచ్చారు. మరి నా తండ్రి కూడా ఇన్‌సర్వీసులోనే చనిపోయాడు కాబట్టి నాకు కూడా నష్టపరిహారం కోరుతూ హైకోర్టులో కేసు వేయవచ్చా? వివరాలు తెలుపగలరు.

వెంకటేశ్వర్లు,
మిర్యాలగూడ, నల్లగొండజిల్లా.

జనరల్ మేనేజర్ హైదరాబాదుకి పంపించిన మీ అప్లికేషన్‌ని ఇంప్లిమెంట్ చేయమని, మీరు 1998లో పొందిన హైకోర్టు ఆర్డర్స్‌ని ఉదహరిస్తూ కొత్తగా ఇంకో రిట్ పిటిషన్ వేసుకోవచ్చు.

మైనరుకి ఇల్లు రిజిస్ట్రేషన్

నా తల్లి 5.12.2002 తేదీన చనిపోయింది. చనిపోయిన తరువాత 9.12.2002 తారీకున మా నాన్నగారు నాపేర డాబ 40వేల రూపాలయల ఖరీదు ఔతుందని నా పేర అగ్రిమెంటు వ్రాసినారు. యాభై రూపాయల స్టాంపుమీద నీకు ఎప్పుడు కావలెనంటె అప్పుడు రిజిస్టరు చేస్తానని వ్రాసినాడు. ఇప్పుడు నాకు రిజిస్టరు చేయమంటె నేను చెయ్యనని అంటున్నాడు. నీవు ఏమి చేసుకుంటావో చేసుకోమని అంటున్నాడు. నా వయస్సు14సం॥లు మైనర్ బాలికను. నాకు ఇంకా వివాహం కాలేదు.

నాగూర్ బి
గుంటూరు.

మీ తల్లిగారు చనిపోయిన తేదీలు చెబుతున్నారు. ఆ ఆస్థి మీ తల్లిగారి పేరుమీద ఏమైనా ఉన్నదా లేదా అనేది ఉదహరించలేదు. మీ తండ్రిగారు మైనర్ బాలిక కూతురు అయిన మీకు అగ్రిమెంటు వ్రాయాల్సిన పరిస్థితిని ఉదహరించలేదు. మీరు మేజర్ అయ్యేంతవరకు ఆ ఆస్థి అమ్మకుండా, అన్యాక్రాంతం కాకుండ కోర్టుద్వారా రక్షణ పొందవచ్చును. మేజర్ అయ్యాక మీ తండ్రిగారు అప్పటికి మీ పేరిట రిజిస్ట్రర్ చేయనిచో కోర్టుద్వారా మీరు సదరు రిజిస్ట్రేషన్ చేయించుకొనవచ్చును.

రౌడీషీట్ ఎత్తివేయమని రిట్ వేయండి

మేము గరివిడి లో గల ఫేకర్ సంస్థలో పనిచేస్తున్నాం. యూనియన్ అధ్యక్షకార్యదర్శులుగా పని చేస్తున్నాము. యూనియన్ కార్యకలాపాలలో మాపై పోలీసులు 3 కేసులు 2000 సం॥లో పెట్టారు. దానితోబాటు మాపై రౌడీషీటు పెట్టారు. అయితే అ కేసులు చీపురుపల్లి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారు కొట్టివేశారు. మాకు యూనియన్ కార్యకలాపాలతో తప్ప బయట ఏ విధమైన గొడవలు లేవు. ఇప్పుడు మాపై ఏ కేసులూ లేవు. కానీ రౌడీషీట్లను పోలీసులు కొనసాగిస్తున్నారు. యూనియన్ నాయకులైతే రౌడీషీట్స్ పెట్టవచ్చా? దీనికి ఏ విధమైన పరిష్కారం లేదా? మమ్మల్ని సంఘ విద్రోహులుగా చూస్తున్నారు. హైకోర్టుగానీ, దిగువకోర్టులో గానీ మా ప్రతిష్ట దిగజార్చినందుకు ఏ విధమైన పరువునష్టం దావా వేయవచ్చు? కేసులు లేకున్నా రౌడీషీట్లు పోలీసులు కొనసాగించవచ్చా? తెలియపర్చగలరు.

ఎస్. సత్యం
గరివిడి, విజయనగరంజిల్లా.

మీ పేరిట ఉన్న కేసులు కొట్టివేయబడినాయి. కావున ఆ తర్వాత కూడ మీపై ఎలాంటి కేసులు లేవు అని తెలుపుతూ హైకోర్టులో మీపై ఉన్న రౌడీషీట్ ఎత్తివేయమని రిట్‌పిటిషన్ వేసి రౌడీషీట్ తీసివేయించుకోవచ్చును.

బంగాళాదుంప కజ్జికాయలు

కావలసిన వస్తువులు:

బంగాళా దుంపలు	:	పావు కిలో
పెద్ద ఉల్లిపాయ	:	ఒకటి
పచ్చిమిర్చి	:	రెండు
అల్లం, వెల్లుల్లి పేస్టు	:	ఒక టీ స్పూన్
ఉప్పు	:	తగినంత
వెడల్పుగా ఉండే బ్రెడ్	:	ఒక ప్యాకెట్
నూనె	:	కాల్చడానికి తగినంత
కొత్తిమీర	:	ఒక కట్ట
పుదీనా	:	ఒక కట్ట

తయారుచేసే విధానం: బంగాళా దుంపలను ఉడికించి చిన్న చిన్న ముక్కలుగా చేయాలి. పెద్ద ఉల్లి, పచ్చి మిర్చిని సన్నగా ముక్కలు కోసుకోవాలి. ముందుగా కొంచెం నూనె వేసి అందులో ఉల్లి, పచ్చి మిర్చి ముక్కలను దోరగా వేపాలి. అందులో వెల్లుల్లి పేస్టు కూడా వేసి వేగ నివ్వాలి. ఇప్పుడు బంగాళా దుంప ముక్కలను వేయాలి. అందులో తగినంత ఉప్పు, కారం, చిటికెడు పసుపు వేసి కూరలాగా తయారు చేయాలి. దించబోయే ముందు కొత్తిమీర, పుదీనా వేయాలి. దీనిని ఆరిన తరువాత చిన్న ఉండలుగా చేయాలి. బ్రెడ్ ముక్కలను నీళ్ళలో ముంచి వెంటనే నీటిని పిండేసి అందులో ఈ బంగాళాదుంప ఉండను ఉంచి దానిని కజ్జికాయల ఆకారంలో చేయాలి. వీటిని కాగిన నూనెలో వేసి బాగా కాల నివ్వాలి. ఇవి కరకరలాడుతూ చాలా రుచిగా ఉంటాయి.

మిక్స్‌డ్ దోసె

కావలసిన వస్తువులు:

బియ్యం పిండి	:	ఒక కప్పు
గోధుమ పిండి	:	ఒక కప్పు
మైదా పిండి	:	ఒక కప్పు
బొంబాయి రవ్వ	:	ఒక కప్పు
శనగ పిండి	:	ఒక కప్పు
తోట కూర	:	ఒక కట్ట
పచ్చికొబ్బరి	:	ఒక చిప్ప
జీలకర్ర	:	రెండు టీ స్పూన్లు
పచ్చి మిర్చి	:	నాలుగు కాయలు
ఉప్పు	:	తగినంత

తయారుచేసే విధానం: ఈ ప్రక్కన చెప్పిన పిండులన్నింటినీ జల్లించుకోవాలి. పచ్చి కొబ్బరి తురుము కోవాలి. తోట కూరను శుభ్రంగా కడిగి సన్నగా తరగాలి. అన్ని రకాల పిండులు, రవ్వ, జీలకర్ర, కొబ్బరి తురుము, తోట కూర, సన్నగా తరిగిన పచ్చి మిర్చి అన్నీ కలిపి దోసెల పిండిలా గరిటె జారుగా కలుపుకోవాలి. దానిని రెండు గంటల సేపు నాన నివ్వాలి. తరువాత ఆ పిండిని దోసెలు వేసుకోవాలి. ఇవి వేడి వేడిగా అల్లం చట్నీతో తింటే చాలా రుచిగా ఉంటాయి.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్లు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: **కలం స్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : **అఫ్షాన్ జబిన్**
వయసు : 9 సం॥
చదువు: 5వ తరగతి
లక్ష్యం: డాక్టర్ లేదా కలెక్టర్ కావడం
చిరునామా:
అఫ్షాన్ జబిన్,
డాటరాఫ్ నయ్యద్ గౌస్ (ఎల్.డి.సి), ఇక్రా మోడల్ స్కూల్, కోటగిరి, నిజామాబాద్ జిల్లా.

పేరు : **ముత్యాల లక్ష్మణ్‌గౌడ్**
వయసు : 13 సం॥
చదువు: 8వ తరగతి
హాబీలు: క్రికెట్ ఆడడం, టీవీ చూడడం, అల్లరి చేయడం, ప్రజాశక్తి చదవడం.
లక్ష్యం: క్రికెట్ జట్టు కెప్టెన్ కావడం
స్కూలు: సిద్ధార్థ హైస్కూల్
చిరునామా:
ముత్యాల లక్ష్మణ్‌గౌడ్, సన్నాఫ్ ప్రభాకర్ గౌడ్, సర్వాపూర్, ములుగు (మం), వరంగల్ - 506 352.

పేరు : **మర్రి శ్రీనివాస్**
వయసు: 14 సం॥
చదువు: 8వ తరగతి
హాబీలు: క్రికెట్ ఆడడం, టీవీ చూడడం, ప్రజాశక్తి చదవడం.
స్కూలు: బి.ఎం. స్కూల్
చిరునామా:
ఎం.శ్రీనివాస్,
సన్నాఫ్ ఎం.సూర్యనారాయణ, డోర్ నెం: 44-1-14, లక్ష్మీనారాయణపురం, కైలాసపురం రోడ్, విశాఖపట్నం.

పేరు : **జొన్నలగడ్డ ప్రవంతి**
వయసు: 10 సం॥
చదువు: 6వ తరగతి
హాబీలు: చదవడం, రాయడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం, బొమ్మలు గీయడం, ప్రజాశక్తి చదవడం.
స్కూలు: జడ్.పి.ఎస్ స్కూల్
చిరునామా:
జొన్నలగడ్డ ప్రవంతి, డాటరాఫ్ శ్రీనివాసరావు, గోవిందాపురం (ఎల్), బోనకల్ (మం), ఖమ్మం.

పేరు : **జెబా పర్వీన్**
వయసు : 6 సం॥
చదువు: 1వ తరగతి
హాబీలు: ఆటలు ఆడడం, చదవడం, అల్లరి చేయడం.
లక్ష్యం: టీచర్ కావడం
చిరునామా:
జెబా పర్వీన్,
డాటరాఫ్ మీర్ ఫిరాసత్ అలీ, ఇక్రా మోడల్ స్కూల్, కోటగిరి, నిజామాబాద్ జిల్లా. **పిన్:**503 207.

పేరు : **గుండెబోయిన శ్రవణ్ గౌడ్**
వయసు: 9 సం॥
చదువు: 4 వ తరగతి
హాబీలు: చదవడం, రాయడం, క్రికెట్ ఆడడం, పాటలు పాడడం
లక్ష్యం: డాక్టర్ కావడం
చిరునామా:
జి.శ్రవణ్‌గౌడ్, శ్రీ విద్యాలయ పబ్లిక్ స్కూల్, సర్వాపురం, ములుగు, వరంగల్-506352.

పేరు : **బి.పవన్‌కుమార్**
వయసు: 15 సం॥
చదువు: 9వ తరగతి
హాబీలు: ప్రజాశక్తి చదవడం, డాన్స్ చేయడం, డ్రాయింగ్ వేయడం, క్రికెట్ ఆడడం.
చిరునామా:
బి.పవన్‌కుమార్, సన్నాఫ్ శంకరాచారి, వన్నాలగూడెం, నకిరేకల్, నల్గొండ జిల్లా.
పిన్: 508 211.

పేరు : **ముత్యాల రమాదేవిగౌడ్**
వయసు: 13 సం॥
చదువు: 8వ తరగతి
హాబీలు: చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం.
లక్ష్యం: టీచర్ కావడం.
స్కూలు: సిద్ధార్థ హైస్కూల్
చిరునామా:
ఎం.రమాదేవిగౌడ్, డాటరాఫ్ ప్రభాకర్‌గౌడ్, ఊరుగొండ, ఆత్మకూర్ (మం), వరంగల్ జిల్లా.